మానేరు

# జనత ®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

22.3.2026 ఆదివారం Sunday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 331 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar


## ఒక్క నిమిషం కూడా వృథా చేయొద్దు

120 శాతం కష్టపడాలి: సహచరులకు కోహ్లీ పిలుపు



సమస్య ఏదైనా జనం కోసం జనతా..

ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



## తీవ్ర రూపం దాలుస్తోన్న ఇరాన్ యుద్ధం

### దాడులను తీవ్రతరం చేసిన ఇరాన్

### హిందూ మహాసముద్రం పైకి బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం

04

రోజురోజుకూ ఇరాన్ యుద్ధం తీవ్రరూపం దాల్చుతోంది. ఈ క్రమంలోనే హిందూ మహాసముద్రం పైకి ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఇలా ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసినట్టు తెలుస్తోంది. ఏకంగా 4 వేల కిలోమీటర్ల దూరంలోని యూఎస్, యూకేల సంయుక్త సైనిక స్థావరమే లక్ష్యంగా రెండు బాలిస్టిక్ క్షిపణుల ను ప్రయోగించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.


## యుద్ధం విరమించే ఆలోచనలో ఉన్నాం

ఇరాన్‌పై యుద్ధంలో తుది దశకు చేరుకున్నాం

సైనిక చర్యలను తగ్గించే విషయం పరిశీలిస్తున్నాం

ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ పోస్ట్

ఇరాన్ చమురు అమ్మకాలపై ఆంక్షలు ఎత్తివేత



## తెలంగాణ వ్యవసాయ రంగంలో ముఖ్యమైన మైలురాయి

### ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి నేడు సీఎం రేవంత్ ప్రారంభం

భారీగా ఏర్పాట్లు చేసిన వ్యవసాయాధికారులు

రైతుబంధు నిధులను కూడా విడుదల చేయనున్న సీఎం

సీఎం రాకతో నర్మెట్టలో భారీగా బందోబస్తు.. ఏర్పాట్లు



**జనతా న్యూస్, సిద్దిపేట** : సిద్దిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద నిర్మించిన ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ప్రారంభం తెలంగాణ వ్యవసాయ రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవబోతోంది. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు కొత్త ఊపును ఇవ్వనుంది. మార్చి 22న ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ ఫ్యాక్టరీ ప్రారంభం కానుంది. అదే రోజు

మిగతా 2 లో





## శ్రమ మాది... శిలాఫలకాలు మీవా?

### నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మా శ్రమ ఫలితం

కాళేశ్వరంతో వ్యవసాయాన్ని పండగ చేశాం

సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి మేం నిర్మించాం

ఒక్కటంటే ఒక్క పనిచేయని రేవంత్

ప్రారంభోత్సవాలకు రావడం.. రిబ్బన్ కట్ చేయడం మీ వంతా

మీడియా సమావేశంలో మండిపడ్డ ఎమ్మెల్యే హరీష్ రావు


వివరాలు 3 లో

సిద్దిపేట నియోజకవర్గానికి చేసిన ద్రోహం, నిధుల రద్దుపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. రేవంత్ ప్రారంభించబోయే అభివృద్ధి పనుల్లో ఏ ఒక్కటీ కాంగ్రెస్ ఇచ్చిందని లేదని.. అవన్నీ బీఆర్ఎస్ హయాంలో నిర్మించుకున్నవే అని తెలిపారు. శ్రమ ఫలితం మాది, శిలాఫలకాలు మీవా? అంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

## మొయినాబాద్ ఫామ్‌హౌజ్ సీజ్

### అసైన్డ్ భూమిలో రోహిత్ రెడ్డి ఫామ్‌హౌజ్

### రెవెన్యూ విచారణలో బాగోతం బట్టబయలు




02

మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్ హౌస్ వ్యవహారం ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. అజీజ్ నగర్‌లోని సర్వే నెంబర్ 177/33 పరిధిలో ఉన్న సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఫామ్ హౌస్ పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో కట్టినట్లు రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో నిర్ధారణ అయ్యింది.

## మొన్న భార్య... నేడు భర్త ఆత్మహత్య

కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ బలవన్మరణం





## ఆర్థిక వ్యవస్థపై యుద్ధ ప్రభావం

డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పతనం

రాబోయే ద్రవ్యోల్బణ సునామీకి సంకేతాలు: రాహుల్

.. వివరాలు 4లో



## యుద్ధరీతులు మారుతున్నాయి

యువత దేశ రక్షణకు నడుం బిగించాలి

కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

.. వివరాలు 4లో

## ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ కూడా అమలు లేదు

### వాటికి చట్టబద్ధత కల్పించాలని ప్రైవేట్ బిల్లు పెడతాం

### మీడియా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోసం అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వెల్లడించారు. ఈ విషయంలో అసెంబ్లీ స్పీకర్, శాసనమండలి చైర్మన్‌ను కలుస్తామని తెలిపారు. ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ కూడా అమలు కాలేదన్నారు.

### ఐటి రంగంలో భారీగా తగ్గిన ఉద్యోగాలు

ప్రభుత్వం సమాధానం చెప్పాలి: కేటీఆర్





## మరో భారీ సైబర్ మోసం

మోసపోయిన మాజీ డీజీపీ మనవరాలు

నకిలీ వాట్సాప్ మెసేజ్‌తో టోకరా

ఖాతా నుంచి 1.20 కోట్లు మాయం

వివరాలు 2 లో..

టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి. పెద్ద పెద్ద కంపెనీల యజమానుల పేర్లతో అకౌంటెంట్లను, ఉద్యోగులను మోసం చేయడం ఇప్పుడు నేరగాళ్లకు పరిపాటిగా మారింది. తాజాగా హైదరాబాద్‌లో ఒక ఉన్నత స్థాయి మహిళా వ్యాపారవేత్త మాజీ డీజీపీ మనుమరాలుని భారీగా మోసగించారు.



## తెలుగు రాష్ట్రాల్లో రంజాన్ సందడి

### ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు.. హైదరాబాద్ ద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

**హైదరాబాద్,మార్చి21 :** దేశవ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అల్లాహ్‌ను స్మరించుకుంటూ ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసారు. తెలుగు రాష్ట్రాల్లోనూ రంజాన్ శోభ కనిపించింది. పవిత్ర దినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్, విజయవాడ, వరంగల్, విశాఖ సహా గ్రామగ్రామాన ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. హైదరాబాద్ మీరాలం ఈద్గా వద్ద వేలాదిగా ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో వందలాది ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు. అలాగే పాతబస్తీ, యనమలకుదురు ప్రాంతాల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనల్లో ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షుబ్లీ, టీడీపీ నేత నాగుల్ మీరా, బీజేపీ నేత సయ్యద్ బాషా, వైసీపీ నేత దేవినేని అవినాశ్ పాల్గొన్నారు. ఇక, హైదరాబాద్ నగరం సైతం రంజాన్ వేడుకలకు సిద్ధమైంది. ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు సిద్ధమవుతున్నారు ముస్లిం సోదరులు. చరిత్రాత్మక మక్కా మసీదులో రంజాన్ వేడుకలు ఇవాళ(శనివారం) ఉదయం 10గంటలకు ప్రారంభంకానున్నాయి. మక్కా మసీదులో భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు ఈద్-ఉల్-ఫితర్ ప్రార్థనలు చేయనున్నారు. పాతబస్తీలో రద్దీని దృష్టిలో ఉంచుకుని మక్కా మసీదు పరిసరాల్లో వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. మక్కా మసీదులో ప్రత్యేక ఈద్ ప్రార్థనలు, భారీ ఇఫ్తార్ విందుల కోసం పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అలాగే మీరాలం ట్యాంక్ వద్ద ఉన్న ఈద్గాకు పెద్ద సంఖ్యలో ముస్లింలు చేరుకుంటున్నారు. మరికొద్దిసేపట్లో సామూహిక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. మీరాలం ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. లా అండ్ ఆర్డర్, క్విక్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లతో భద్రతను ఏర్పాటు చేశారు. రద్దీ నేపథ్యంలో మీరాలం పరిసర ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉండనున్నాయి. ఈనెల 19న నెలవంక కనిపించకపోవడంతో భారతదేశంలో రంజాన్ పండుగను శనివారం జరుపుకుంటున్నారు.

## మొయినాబాద్ ఫామ్‌హౌజ్ సీజ్

### అసైన్డ్ భూమిలో రోహిత్ రెడ్డి ఫామ్‌హౌజ్

### రెవెన్యూ విచారణలో బాగోతం బట్టబయలు

**హైదరాబాద్,మార్చి21 :** మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్ హౌస్ వ్యవహారం ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. అజీజ్ నగర్‌లోని సర్వే నెంబర్ 177/33 పరిధిలో ఉన్న సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఫామ్ హౌస్ పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో కట్టినట్లు రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో నిర్ధారణ అయ్యింది. మొయినాబాద్ పోలీసులు ఫామ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. డ్రగ్స్ పార్టీ నిర్వహించిన సమయంలో ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీకి హాజరైన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ ఫామ్‌హౌస్‌ను అసైన్డ్ భూమిలో నిర్మించినట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. 2006లో ఈ భూమి రోహిత్ రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్లు రికార్డులు చెబుతున్నప్పటికీ, భూభారతి రికార్డుల ప్రకారం అది జంగయ్య అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అసలు ప్రభుత్వానికి చెందిన అసైన్డ్ భూమిపై రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందనే అంశంపై ప్రస్తుతం రెవెన్యూ , పోలీస్ యంత్రాంగం లోతుగా ఆరా తీస్తోంది. ఈ అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసిన రెవెన్యూ శాఖ, ఫామ్ హౌస్‌ను సీజ్ చేయాల్సిందిగా ఇప్పటికే అధికారులకు నివేదిక అందించింది. పోలీసుల విచారణలో భాగంగా ప్రస్తుతం ఈ ఫామ్ హౌస్ వారి కస్టడీలోనే ఉంది. అక్కడికి పార్టీ కోసం వచ్చిన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదు లగ్జరీ కార్లను సీజ్ చేసి, ఆ సమాచారాన్ని కోర్టుకు నివేదించారు. పార్టీకి హాజరైన వారు తమ వాహనాలను అక్కడే వదిలేసి వెళ్లడంతో పోలీసులు వాటిని సీజ్ చేసి విచారణను వేగవంతం చేశారు. త్వరలోనే ఈ ఫామ్ హౌస్ సీజ్ పక్రియ పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది.

## డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు

### అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు

**రంగారెడ్డి,మార్చి21 :** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు పెంచింది. ఈ కేసు తాజాగా కీలక మలుపు తిరిగింది. డ్రగ్ పెడ్లర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్‌ను సిట్ బృందం అదుపులోకి తీసుకుంది. నిందితుల్లో ఒక్కరైన కౌశిక్ రవి ఇచ్చిన సమాచారంతో నాలుగు బృందాలుగా ఏర్పడిన సిట్ ఎట్టకేలకు అతణ్ని పట్టుకుంది. హైదరాబాద్‌లోనే అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకోవడం గమనార్హం. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ పార్టీకి అభిషేక్ సింగ్ డ్రగ్స్ సప్లై చేశాడు. హైదరాబాద్ క్షఖీఖీ వద్ద అభిషేక్ సింగ్ నుంచి రోహిత్ డ్రైవర్ శరత్ డ్రగ్స్ కొనుగోలు చేశాడు. అనంతరం పార్టీలో నమిత్ శర్మ, రోహిత్ రెడ్డి, రితేశ్‌రెడ్డి, పుట్టా మహేశ్ కుమార్, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవి డ్రగ్స్ వినియోగించారు. నమిత్ శర్మ మూడు రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు రక్త పరీక్షల్లో బయటపడగా.. పైలట్ రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, అర్జున్ రెడ్డి మద్యంలో కొకైన్ కలుపుకుని తాగినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. ఃాజాగా, అభిషేక్ సింగ్ పోలీసులకు చిక్కడంతో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అభిషేక్ సింగ్ నుంచి ఇంకా ఎవరెవరూ డ్రగ్స్ కొనుగోలు చేశారు? అనే విషయంపైనా కూపీ లాగుతున్నారు సిట్ అధికారులు. మరోవైపు అతని ఫోన్‌లో కీలక డేటా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అభిషేక్ సింగ్ సెల్ ఫోన్ డేటాను విశ్లేస్తున్నారు సిట్ అధికారులు.

## మొన్న భార్య ...నేడు భర్త ఆత్మహత్య

### కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ బలవన్మరణం

**కరీంనగర్,మార్చి21 :** కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 18వ తేదీన చంద్రశేఖర్ భార్య దివ్య ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన చంద్రశేఖర్.. ఇల్లంతకుంట మండలం సీతంపేటలోని అత్తగారింట్లో ఉరివేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సీతంపేటకు చెందిన దివ్య(30)కు 2016లో దేసు చంద్రశేఖర్‌తో వివాహమైంది. ప్రస్తుతం వీరు కరీంనగర్‌లోని హనుమాన్‌నగర్‌లో ఉంటుండగా.. చంద్రశేఖర్ టూటౌన్‌లో ఎస్సైగా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కొడుకులు. చంద్రశేఖర్ రోజుమాదిరిగా మంగళవారం ఇద్దరు పిల్లలను పాఠశాలలో వదిలి డ్యూటీకి వెళ్లాడు. కాగా దివ్య కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆమె గన్నేరుపూలు, ఆకులు మిక్సీ చేసుకొని తాగింది. విషయాన్ని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పింది. సమాచారం తెలిసిన భర్త దివ్యను హైదరాబాద్‌లోని హాస్పిటల్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, దివ్య మృతికి చంద్రశేఖర్ కారణమని.. ఆమె అంత్యక్రియల సందర్భంగా ఎస్సైపై సీతంపేట గ్రామస్తులు దాడి చేశారు. ఆ సమయంలో ఆ దాడిని దివ్య తండ్రి అడ్డుకోవడం గమనార్హం. ఈ క్రమంలో భార్య మృతిని తట్టుకోలేని చంద్రశేఖర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణ వ్యవసాయ రంగంలో

# ముఖ్యమైన మైలురాయి

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర రైతులకు రైతు భరోసా నిధుల విడుదల కూడా జరగనుంది. ఈ రెండు కార్యక్రమాలు ఒకే వేదికపై జరగడం తెలంగాణ రైతాంగానికి శుభసూచకంగా భావించాలి. ఈ సందర్భంగా నర్మెటలో భారీ ఏర్పాట్లు చేశారు. సిఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల, పొన్నం తదితరులు పాల్గొంటారు. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతులకు దీర్ఘకాలిక ఆదాయం కల్పించే పంటగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఈ నేపథ్యంలో నర్మెట్టలో అత్యాధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించారు. సుమారు 62 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ ఆధునిక సాంకేతికతతో రూపొందించారు. ప్రారంభంలో గంటకు 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేసే ఈ మిల్లు భవిష్యత్తులో 120 మెట్రిక్ టన్నుల వరకు విస్తరించేలా రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్టు వేగంగా పూర్తికావడంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. ఆయన తరచుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని సమీక్షించారు. అదే విధంగా జంగా రాఘవరెడ్డి నాయకత్వంలో ఆయిల్ ఫెడ్ అధికారులు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని రికార్డు సమయంలో పూర్తి చేశారు. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా మార్చి 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు రైతు మేళా నిర్వహిస్తున్నారు. ఇందులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, ఆయిల్ పామ్ సాగులోని మెలకువలపై రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించింది. మొదటి విడతగా నర్మెట్టలో జరిగే కార్యక్రమంలో 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,590 కోట్లు నేరుగా జమ చేయనున్నారు. అనంతరం మరో 20 రోజుల తర్వాత రూ.2,650 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోగా మిగిలిన రైతులకు కూడా నిధులు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తంగా



రాష్ట్రంలో 1.50 కోట్ల ఎకరాలకు సంబంధించి సుమారు రూ.9,000 కోట్లు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. రైతులు వ్యవసాయరంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి .. ఆదాయం బాటలో నడవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు మహోత్సవ మేళా కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో నిర్వహిస్తోంది. ఈ మేళాలో వ్యవసాయం, ఉద్యానం, పట్టుపరిశ్రమ, మత్స్యశాఖ, మార్క్‌ఫెడ్, విత్తనాభివృద్ధి సంస్థ, చేనేత జౌళి శాఖలతోపాటు విజయడైరీ, సాగు యంత్రాలతో 150 స్టాళను ఏర్పాటు చేశారు. సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, జనగామ, కరీంనగర్, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మెదక్, వరంగల్, కామారెడ్డి జిల్లాల నుంచి 50 వేల మందికి పైగా పాల్గొంటున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారిణి స్వరూపరాణి తెలిపారు. సోలార్ సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ యాప్ ద్వారా పొలానికి నీరు అందించే పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. 'ఆటోపామ్' సంస్థ వారు ఫోన్‌ను వాడుతూ పంటకు నీరు అందించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. బిందు సేద్యంలో పంటకు మందులను సైతం పంపవచ్చు. ఒకసారి ఏర్పాటు చేసుకుంటే పదేళ్ల పాటు వినియోగించుకోవచ్చని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆవిష్కరించిన సమీకృత వ్యవసాయ ప్రదర్శన ఇది. చిన్న, సన్నకారు రైతులకు ఎంతో లాభదాయకం. 2-3 ఎకరాలు భూమి ఉన్న రైతులు ఒకే పంట కాకుండా వరి, కందులు, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు, పశుగ్రాసం, కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమ, చేపలు, గొర్రెలు, మేకల పెంపకం చేపట్టవచ్చు. రోజూ ఆదాయం పొందవచ్చని విద్యార్థిని శివాని తెలిపారు. సంప్రదాయ పంటలను సాగు చేసి నష్టాలు చవిచూసిన రైతులకు అధిక దిడుబడులు సాధించే దిశగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవిష్కరించిన నూతన వంగడాలు ఇవి. వరి రకాలు తెలంగాణ సోనా, కె.యన్.ఎమ్ 1638, కంది డబ్ల్యూఆర్జీ 255, పెసర ఎం.జి.జి. 385, వేరుశనగ జేసీజీ 2141, ఆముదం పీసీఎస్ 262, తెలంగాణ జొన్న, పాలెం రాగి వంటి సంకర జాతి విత్తనాలను ప్రదర్శించారు.

## జీవన్‌రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి చర్చలు

### పార్టీ మారే ఆలోచన విరమించుకోవాలని వినతి

### పార్టీలో అవమానం జరుగుతుంటే ఎలా అని జీవన్ నిలదీత

### భవిష్యత్ కార్యాచరణను నేడు చెబుతానన్న జీవన్ రెడ్డి

**జగిత్యాల,మార్చి21 :** పార్టీ మారతానన్న కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డిని బుజ్జగించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, లక్ష్మణ్, ఎమ్మెల్యే సత్యం భేటీ అయ్యారు. గంటకుపైగా సమావేశమయ్యారు. పార్టీలో గౌరవం దక్కడం లేదని ఈ సందర్భంగా మంత్రుల ముందు జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సమస్య ఉంటే అధిష్టానంతో మాట్లాడుదామని, పార్టీ మారే ఆలోచన మంచిది కాదని సూచించారు. దీనికి జీవన్ రెడ్డి పెద్దగా స్పందించలేదు. ఈ భేటీ అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. జీవన్‌రెడ్డి 4 దశాబ్దాలుగా పార్టీలో ఉన్నారని అన్నారు. ఆయనతో అనేక అంశాలు చర్చించినట్లు తెలిపారు. ఆయన ఆవేదనను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ భేటీ అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడారు. తన నిర్ణయంలో ఎలాంటి మార్పు



లేదన్నారు. పూర్తి వివరాలు రేపు వెల్లడిస్తానని చెప్పారు. కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తితో ఉన్న మాజీ మంత్రి, సీనియర్ నాయకులు జీవన్‌రెడ్డి పార్టీ మారుతారన్న ప్రచారంతో ఇద్దరు మంత్రులను కాంగ్రెస్ రంగంలోకి దింపింది. పార్టీ వీడకుండా ఉండేందుకు ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ సంప్రదింపులు మొదలుపెట్టారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ.. అసలు కాంగ్రెస్ నాయకులకు అన్యాయం చేయడంపై జీవన్ రెడ్డి కొంతకాలంగా బహిరంగంగానే అసమ్మతి తెలుపు తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కూడా ఆయన అధిష్ఠానాన్ని కోరారు. కానీ హైకమాండ్ పట్టించుకోకపోవడంతో పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో సమావేశానికి రావాలని రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆహ్వానించారు. కానీ మీనాక్షి నటరాజన్‌తో జరగాల్సిన మీటింగ్‌కు జీవన్ రెడ్డి గైర్హాజరయ్యారు. ఈ క్రమంలోనే జీవన్ రెడ్డి ఇంటికి ఉదయం మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వెళ్లారు. జీవన్ రెడ్డితో అల్పాహారం చేస్తూ ముచ్చటిస్తున్నారు. కాగా, రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ఇవాళ కాంగ్రెస్ పార్టీ లేదని జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సమయంలో మీడియాను లోపలికి అనుమతించకుండా రహస్యంగా చర్చించారు. ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా చేస్తున్నారని సమాచారం.

## మరో భారీ సైబర్ మోసం

### మోసపోయిన మాజీ డిజిపి మనవరాలు

### నకిలీ వాట్సాప్ మెసేజ్‌తో టోకరా

### ఖాతా నుంచి 1.20 కోట్లు మాయం

**హైదరాబాద్,మార్చి21 :** టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి. పెద్ద పెద్ద కంపెనీల యజమానుల పేర్లతో అకౌంటెంట్లను, ఉద్యోగులను మోసం చేయడం ఇప్పుడు నేరగాళ్లకు పరిపాటిగా మారింది. తాజాగా హైదరాబాద్‌లో ఒక ఉన్నత స్థాయి మహిళా వ్యాపారవేత్త మాజీ డీజీపీ మనుమరాలుని భారీగా మోసగించారు. ఈ ఘటన మరోసారి సైబర్ నేరగాళ్ల చాకచక్యాన్ని బయటపెట్టింది. ఈ ఘటనపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మహిళా వ్యాపారవేత్త, మాజీ డీజీపీ మనవరాలికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. దివ్యారెడ్డి 18 కంపెనీలకు డైరెక్టర్‌గా ఉన్నారు. సైబర్ నేరగాళ్లు ఆమెతో పాటు అకౌంటెంట్‌ను మోసం చేశారు. ఈ నెల 13న దివ్యారెడ్డి పేరు, ఫొటోతో ఉన్న వాట్సప్ ఖాతా నుంచి అకౌంటెంట్‌కు మెసేజ్ వచ్చింది. తాను మీటింగ్‌లో ఉన్నానని.. చెప్పిన ఖాతాకు రూ.1.20 కోట్లు పంపాలని అందులో ఉంది. దీంతో అకౌంటెంట్ ఆ డబ్బును పంపారు. ఈ నెల 17న మరోసారి డబ్బు పంపాలంటూ వాట్సప్ మెసేజ్ వచ్చింది. ఈ క్రమంలో డబ్బులు పంపేందుకు చెక్ అప్రూవల్ కోసం డైరెక్టర్‌ను అకౌంటెంట్ సంప్రదించారు. గతంలో చేసిన రూ.1.20 కోట్ల లావాదేవి వివరాలను అకౌంటెంట్ చెప్పారు. తాను ఎవరికీ డబ్బు పంపమని చెప్పలేదని దివ్యారెడ్డి స్పష్టతనిచ్చారు. వెంటనే బాధితులు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ ఘటనలో సైబర్ నేరగాళ్లు అత్యంత చాకచక్యంగా వ్యవహరించారు. ఈ నెల 13న మహిళా వ్యాపారవేత్త పేరు, ఫొటోతో ఒక ఫేక్ వాట్సాప్ అకౌంట్ సృష్టించారు. ఆ అకౌంట్ నుంచి ఆమె సంస్థలో పనిచేసే అకౌంటెంట్‌కు మెసేజ్ పంపించారు. 'మీటింగ్‌లో ఉన్నానని.. వెంటనే ఈ ఖాతాకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయండి' అంటూ తెలిపారు. ఆ సందేశాన్ని నిజమని నమ్మిన అకౌంటెంట్ ఎలాంటి అనుమానం లేకుండా ఒకే ట్రాన్సాక్షన్‌లో రూ.1.20 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఈ మోసం వెంటనే బయటపడలేదు. ఈ నెల 17వ తేదీన అదేవిధంగా మరోసారి మెసేజ్ వచ్చింది. ఈసారి డబ్బులు పంపేముందు అకౌంటెంట్ చెక్ అప్రూవల్ కోసం మహిళా వ్యాపారవేత్తను సంప్రదించారు. అప్పుడే అసలు విషయం బయటపడింది. 'నేను ఎలాంటి డబ్బు పంపమని చెప్పలేదు' అని ఆమె చెప్పడంతో ముందే జరిగిన ట్రాన్సాక్షన్ గురించి తెలుసుకుని ఆ మహిళా షాక్‌కు గురయ్యారు. మోసం తెలిసిన వెంటనే బాధితురాలు 1930 నంబర్ ద్వారా సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు అధికారికంగా కంప్లైంట్ ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ విచారణలో భాగంగా కేరళకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. ఈ ఘటన నేపథ్యంలో పోలీసులు ప్రజలకు కొన్ని కీలక సూచనలు చేశారు. ఒక చిన్న నిర్లక్ష్యం వల్ల రూ.1.20 కోట్ల భారీ నష్టం జరిగిందని.. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండటం అత్యంత అవసరమని సైబర్ క్రైం పోలీసులు సూచించారు. డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయమని మెసేజ్ వస్తే తప్పనిసరిగా కాల్ చేసి నిర్ధారించాలని సూచించారు. వాట్సాప్ మెసేజ్‌లను నమ్మకూడదని, ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాలని అన్నారు. పెద్ద మొత్తాల లావాదేవీలకు డబుల్ వెరిఫికేషన్ తప్పనిసరి అని తెలిపారు. అనుమానం వస్తే వెంటనే 1930 హెల్ప్ లైన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

# శ్రమ మాది... శిలాఫలకాలు మీవా?

**నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మా శ్రమ ఫలితం**

**కాళేశ్వరంతో వ్యవసాయాన్ని పండగ చేశాం**

**సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి మేం నిర్మించాం**

**ఒక్కటంటే ఒక్క పనిచేయని రేవంత్**

**ప్రాంభోత్సవాలకు రావడం..రిబ్బన్ కట్ చేయడం మీ వంతా**

**మీడియా సమావేశంలో మండిపడ్డ ఎమ్మెల్యే హరీష్ రావు**



**సిద్దిపేట,మార్చి21 :** సిద్దిపేట నియోజకవర్గానికి చేసిన ద్రోహం, నిధుల రద్దుపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని స్తానిక ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. రేవంత్ ప్రారంభించబోయే అభివృద్ధి పనుల్లో ఏ ఒక్కటీ కాంగ్రెస్ ఇచ్చిందని లేదని.. అవన్నీ బీఆర్ఎస్ హయాంలో నిర్మించుకున్నవే అని తెలిపారు. శ్రమ ఫలితం మాది, శిలాఫలకాలు మీవా? అంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఘాటు విమర్శలు చేశారు. సీఎం రేవంత్ ఆదివారం సిద్దిపేట పర్యటన నేపథ్యంలో పలు ప్రశ్నలు సంధించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మేం అసెంబ్లీలో చేసిన ఒత్తిడితోనే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చిందని హరీశ్ రావు తెలిపారు. మా పోరాటం ఫలితంగానే ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.సిద్దిపేట జిల్లా నర్మెట్టలో 365 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి రేపు ప్రారంభించే ఆయిల్ ఫ్యాక్టరీ 2021లోనే ప్రారంభించాం. ఈ ఆయిల్ ఫామ్‌కి ప్రాణాధారం కాళేశ్వరం ప్రాజెక్టు. కాళేశ్వరాన్ని కూలేశ్వరం అన్న రేవంత్ రెడ్డి తన వైఖరి మార్చుకోవాలి. కాళేశ్వరాన్ని అడ్డుకోవడానికి ఆయన అనేక ప్రయత్నాలు చేశారు. మొక్కవోని దీక్షతో పూర్తి చేసింది మేము. ఇప్పటికైనా కాళేశ్వరంపై చిల్లర మాటలు మానుకో అని హితవు చెప్పారు. ఆ ప్రాజెక్టు పూర్తి చేయడంలో అనేక విధాలుగా శ్రమ పడ్డాం. 20 కోట్ల లీటర్ల నీటి నిలువ సామర్థ్యం కలిగిన పాండ్ నిర్మించాం. మలేషియా టెక్నాలజీతో ఇండియాలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాం అన్నారు. బీఆర్ఎస్ కృషి ఫలితమే ఆయిల్ ఫ్యాక్టరీ. దాన్ని ఈరోజు రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి, రెండు పీహెచ్సీలు నేను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండగా మంజూరు చేసి పూర్తి చేసినవి. వీటికి మీరు శిలాఫలకం వేసుకుని ప్రారంభిస్తున్నారు. ఇందులో మీరు చేసిందేమీ లేదు. మేము ఆలయాలు, విద్యాలయాలు, రిజర్వాయర్లు, జైళ్లు నిర్మించాం. రూ.78కోట్లతో 30 ఎకరాల్లో జిల్లా జైలు నిర్మించాం. కట్టించింది మేము, శిలాఫలకం మీరు వేసుకున్నారు. చేసుకో నాకేమీ ఈర్ష్య లేదు. కానీ శ్రమ ఎవరిది, శిలాఫలకం ఎవరిది?. కనపడిన ప్రతి దేవుడు మీద ఒట్టుపెట్టి రుణమాఫీ అన్నారు.. అది ఇప్పటికీ కాలేదు. సిద్దిపేట జిల్లాలో 22వేల మంది రైతులకు రూ.300కోట్ల రుణమాఫీ పెండింగ్‌లో ఉంది. ఒక నర్మెట్టలోనే 350మంది రైతులకు రుణమాఫీ కాలేదు. మా నియోజకవర్గంలో రుణమాఫీ అయ్యింది 48 శాతం, కానిది 52 శాతం. మూడు పంటలకు రైతు బంధు ఎగ్గొట్టారు. రేపు ఏ రైతు బంధు ఇస్తున్నారో రేవంత్ తెలపాలని డిమాండ్ చేశారు. పంటల బీమా రెండున్నర ఏళ్లుగా చేయలేదు. నష్టపోయిన రైతులకి ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదు. వడగళ్ల బాధిత రైతులకు నిధులు విడుదల చేయాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్క పనీ సిద్దిపేటకు ఇవ్వలేదు. సిద్దిపేటలో జరుగుతున్న రూ.1071 కోట్ల పనులనూ అర్థాంతరంగా రద్దు చేశారు. ఆ నిధులు వెంటనే పునరుద్ధరించాలి. ప్రభుత్వ వెటర్నరీ కాలేజీ, రంగనాయకసాగర్ టూరిజం, శిల్పారామం, స్పోర్ట్స్ స్టేడియం ఇలా అనేక పనులు రద్దు చేశారు. వీటిలో కొన్నిటిని కొడంగల్?కు రేవంత్ ఎత్తుకుపోయారు. ఇది ఒక ముఖ్యమంత్రి చేయాల్సిన పనేనా?. ఏ ముఖం పెట్టుకుని సిద్దిపేటకు వస్తున్నారు. మీరు రద్దు చేసిన గొప్పలు చెప్పుకోవడానికి వస్తున్నావా?' అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారని హరీశ్‌రావు తెలిపారు. క్వింటాల్‌కు రూ. 2400 మద్దతు ధర ఉంటే.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో నిన్నటిదాకా రైతులు బయట దళారులకు రూ. 1600-1700లకే అమ్ముకుని తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం ముందే ఈ కేంద్రాలను ప్రారంభించి ఉంటే రైతులందరికీ మేలు జరిగేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే 20 నుంచి 25 శాతం మొక్కజొన్న దళారుల చేతుల్లోకి వెళ్లిపోయిందని చెప్పారు. ఇప్పటికైనా రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. మన ప్రాంతంలో సన్‌ఫ్లవర్ కూడా బాగా సాగు చేస్తున్నారని.. దానికి కూడా ఈరోజు కొనుగోలు కేంద్రం ప్రారంభించామని హరీశ్‌రావు తెలిపారు. సన్‌ఫ్లవర్‌కు క్వింటాల్‌కు రూ. 7721 మద్దతు ధర ఉందని.. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఆదాయం పొందాలని సూచించారు. సన్‌ఫ్లవర్ తక్కువ కాలంలో పూర్తయ్యే పంట.. దీనివల్ల అధిక ఆదాయంతో పాటు మంచి దిగుబడి కూడా వస్తుందని అన్నారు. పంట మార్పిడికి కూడా ఇది ఎంతో ఉపయోగకరమని అన్నారు. రాబోయే రోజుల్లో దీన్ని ఇంకా ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ యాసంగిలో మన సిద్దిపేట ప్రాంతంలో ఇంత మంచి దిగుబడి వస్తుందంటే, ఈ స్థాయిలో పంటలు పండుతున్నాయంటే దానికి ఏకైక కారణం కాళేశ్వరం ప్రాజెక్టే అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఒకప్పుడు సిద్దిపేట నియోజకవర్గంలో యాసంగి సాగు కేవలం 8 వేల ఎకరాలు మాత్రమే

ఉండేది. కానీ ఇవాళ కాళేశ్వరం జలాల పుణ్యమా అని అది పదింతలు పెరిగి ఏకంగా 80 వేల ఎకరాల్లో యాసంగి సాగు జరుగుతోందని తెలిపారు. 2005వ సంవత్సరంలో కరువు వచ్చిన పరిస్థితులు నాకు ఇంకా బాగా గుర్తున్నాయన్నారు. తాగడానికి నీళ్లు లేక, పశువులకు గడ్డి లేక అల్లాడిపోయామని పేర్కొన్నారు. పశువులను బతికించుకోవడానికి చిన్నకోడూరు, రాజగోపాల్‌పేట, నంగునూరులో పశుగ్రాస కేంద్రాలు పెట్టి ఆంధ్రా నుంచి 40 లక్షల మెట్రిక్ టన్నుల గడ్డి తెచ్చి రైతులకు సప్లై చేశామని గుర్తుచేశారు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చాక సిద్దిపేట దరిదాపుల్లో కరువు అనే మాటే లేదని తెలిపారు. వానలు పడినా, పడకపోయినా కాలంతో సంబంధం లేకుండా రైతులు రెండు పంటలు పండిస్తూ బంగారం లాంటి దిగుబడులు సాధిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఒకప్పుడు కరువుతో అల్లాడిన మన ప్రాంతానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఒక వరంలా మారిందని హరీశ్‌రావు తెలిపారు. ఈ ప్రాజెక్టు మన ప్రాంత రూపురేఖలను మార్చేసి, వ్యవసాయానికి కొత్త దిశానిర్దేశర చేసిందని పేర్కొన్నారు. రైతులు ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల ద్వారానే తమ పంటను అమ్ముకుని ప్రభుత్వ మద్దతు ధరను పూర్తిస్థాయిలో పొందాలని సూచించారు

# ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ కూడా అమలు లేదు

**వాటికి చట్టబద్ధత కల్పించాలని ప్రైవేట్ బిల్లు పెడతాం**

**మీడియా సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**



**హైదరాబాద్,మార్చి21 :** ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోసం అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వెల్లడించారు. ఈ విషయంలో అసెంబ్లీ స్పీకర్, శాసనమండలి చైర్మన్‌ను కలుస్తామని తెలిపారు. ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ కూడా అమలు కాలేదన్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల బిల్లుకు మద్దతు కోసం అన్నిపార్టీలకు లేఖలు రాస్తామని చెప్పుకొచ్చారు. 840 రోజులు అయినా ఆరు గ్యారంటీలు ఎందుకు అమలు చేయట్లేదని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు పెద్ద ఫ్రాడ్ అని ఎద్దేవా చేశారు. సీఎం సంతకం చేసిన ÷ల్ ఎందుకు దొరకడం లేదని నిలదీశారు. ఈ ఫైల్ ఢిల్లీ విమాన ప్రయాణంలో పోయిందా..?, ఎఫ్ఎస్ఎల్ అగ్నిప్రమాదంలో కాలిపోయిందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ సర్కార్ ఇంకా ఒక బ్జడెట్ మాత్రమే ప్రవేశపెట్టాల్సి ఉందని.. ఆరు గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు చట్టమైతే అన్నివర్గాలకు లాభం కలుగుతుందని చెప్పుకొచ్చారు. ప్రజల తరఫున ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడుతున్నామని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టిన చరిత్ర అసెంబ్లీకి ఉందని ప్రస్తావించారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు.. బీజేపీ ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టిందని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును బీజేపీ వ్యతిరేకించినా ఇబ్బంది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం కోటి మోసాలు చేసిందని ధ్వజమెత్తారు. ప్రజల నుంచి ఓట్లు రాబట్టడానికి అడ్డగోలు హామీలు ఇచ్చిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల హామీల అమలు చట్టం ÷ల్‌పై సంతకం చేశారని ఉభయ సభల్లో గత గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తన ప్రసంగంలో చెప్పారని ప్రస్తావించారు.

## ఐటి రంగంలో భారీగా తగ్గిన ఉద్యోగాలు

**ప్రభుత్వం సమాధానం చెప్పాలి: కెటిఆర్**

**హైదరాబాద్,మార్చి21 :** రాష్ట్రంలోని ఐటీ రంగంలో భారీగా ఉద్యోగాలు తగ్గుదలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగాలు తగ్గాయని ప్రభుత్వం ఒక్క వారంలోనే రెండుసార్లు ఒప్పుకోవడం ఆందోళనకరమైన విషయామని అన్నారు. 2023లో హైదరాబాద్‌లోని ఐటీ రంగంలో 9.46లక్షల ఉద్యోగాలు ఉండేవని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ 2026 నాటికి అవి 9.39 లక్షలకు తగ్గాయని ప్రభుత్వం ఒప్పుకుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మొదట మార్చి 16న అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా వెల్లడించారని చెప్పారు. అనంతరం బ్జడెట్ ప్రవేశపెడుతున్న సమయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారని తెలిపారు. ఐటీ సెక్టార్‌లో గణనీయంగా ఉద్యోగాల తగ్గుదలపై వారం వ్యవధిలోనే ప్రభుత్వం రెండు సార్లు అంగీకరించడం ఆశ్చర్యకరమని కేటీఆర్ అన్నారు. ఐటీ రంగంలో ఈ ఉద్యోగాల తగ్గుదలకు కృత్రిమ మేధస్సు కారణమా? లేదా కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా వైఫల్యమా అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే దానంకు క్లీన్ చిట్‌పై బిజెపి ఆగ్రహం

**స్పీకర్ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్**

**హైదరాబాద్,మార్చి21 :** తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి న్యాయస్థానం చేరింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సంబంధించి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన క్లీన్ చిట్ రాజ్యాంగ విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. గత సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున ఖైరతాబాద్ నుంచి గెలుపొందిన దానం నాగేందర్, ఆ తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ కండువా కప్పుకోవడమే కాకుండా, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీ ఎన్నికల్లో కూడా పోటీ చేశారు. బీఆర్ఎస్ బీ-ఫామ్ ద్వారా గెలిచి మరో పార్టీలోకి వెళ్లినందున ఆయనపై అనర్హత వేటు వేయాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ జరిపిన స్పీకర్, దానం నాగేందర్ అసలు పార్టీ మారలేదని, ఆయనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని క్లీన్ చిట్ ఇచ్చారు. అయితే, బహిరంగంగానే పార్టీ మారిన వ్యక్తికి స్పీకర్ ఇలాంటి తీర్పు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లో అసెంబ్లీ స్పీకర్‌ను , దానం నాగేందర్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఈ కీలక పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సోమవారం విచారణ జరపనుంది. స్పీకర్ నిర్ణయంపై కోర్టు ఏ రకమైన స్పందన తెలియజేస్తుందోనని రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ విచారణలో పిటిషనర్ తరపున, స్పీకర్ తరపున , దానం నాగేందర్ తరపు న్యాయవాదులు తమ వాదనలను వినిపించనున్నారు.

## మియాపూర్‌లో దారుణ ఘటన

**తను కోరుకున్న యువతి మరొకరితో పెళ్లి.. కోపంతో యువతిపై కత్తితో దాడి**

**హైదరాబాద్,మార్చి21 :** మియాపూర్‌లో దారుణం చోటుచేసుకుంది. తనని కాదని వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుందన్న కోపంతో ఓ యువకుడు మహిళపై కత్తితో దాడి చేశాడు. తండ్రి, స్నేహితుడితో మహిళ ఇంటికి వెళ్లి మరీ ఈ ఘోరానికి ఒడిగట్టాడు. సంఘటనకు సంబంధించిన ంపూర్తి వివరాల్లోకి వెళితే.. కాకినాడకు చెందిన 25 ఏళ్ల నూకరత్నం అనే మహిళ కొన్నేళ్ల క్రితం భర్తను కోల్పోయింది. ప్రస్తుతం తన ఇద్దరు కూతుళ్లతో కలిసి మియాపూర్‌లోని రెడ్డి కాలనీలో నివసిస్తోంది. స్థానికంగా హౌస్ కీపింగ్ పని చేస్తూ జీవిస్తోంది. కొంత కాలం క్రితం ఆమెకు ప్రసాద్ అనే వ్యక్తితో పరిచయం అయింది. ఇద్దరూ ఫిబ్రవరి 20వ తేదీన పెళ్లి చేసుకున్నారు. అయితే, వీరి పెళ్లి ఆలీషా అలియాస్ పాండు అనే యువకుడికి నచ్చలేదు. నూకరత్నం హౌస్ కీపింగ్ చేస్తున్న చోట పాండు వంటవాడిగా పని చేస్తున్నాడు. అతడు నూకరత్నంను ఇష్టపడ్డాడు. పెళ్లి కూడా చేసుకోవాలని అనుకున్నాడు. ఇంతలోనే నూకరత్నం.. ప్రసాద్‌ను పెళ్లి చేసుకుంది. దీంతో పాండు తట్టుకోలేకపోయాడు. ఈ నెల 19వ తేదీన తండ్రి లాలూ, స్నేహితుడు జాన్‌లతో కలిసి నూకరత్నం ఇంటికి వెళ్లాడు. ఆమెను తనతో పాటు రమ్మని అడిగాడు. ఇందుకు నూకరత్నం ఒప్పుకోలేదు.మె తన మాట వినకపోవటంతో పాండు ఆగ్రహానికి గురయ్యాడు. వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడి చేశాడు. పాండు కత్తి దాడిలో నూకరత్నం తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే ఆమెను గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడ్డ పాండుతో పాటు అతడి తండ్రి లాలూను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# కుళ్లిపోయిన పదార్థాలతో సమోసాలు

**కుళ్లిన గుడ్లతో ఎగ్‌ఫప్స్ తయారీ**

**పాతపబస్తీ కుల్సుంపురాలో అధికారుల దాడి**

**అక్రమంగా నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్**

**హైదరాబాద్,మార్చి21 :** హైదరాబాద్ లోని కుల్సుంపురా ప్రాంతంలో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. కుళ్లిపోయిన పదార్థాలతో సమోసాలు, పఫ్స్ తయారు చేసి నగరంలోని ప్రముఖ హోటళ్లకు సరఫరా చేస్తున్న నిందితుడిని అధికారులు అరెస్ట్ చేశారు. అబ్దుల్ అనే వ్యక్తి అపరిశుభ్ర వాతావరణంలో నాసిరకం పదార్థాలతో ఆహారం తయారు చేస్తున్నట్లు దర్యాప్తులో బయటపడింది. ముఖ్యంగా కుళ్లిపోయిన గుడ్లతో ఎగ్ పఫ్స్ తయారు చేసి హోటళ్లకు పంపిస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయం తెలిసిన వెంటనే అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పెద్ద మొత్తంలో పాడైన, నాసిరకం ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఊఈం÷ు అధికారులు కేసు నమోదు చేసి అబ్దుల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనతో కుల్సుంపురా ప్రాంతంలో తయారవుతున్న ఫుడ్ ఐటమ్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండలని అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోను హైదరాబాద్ పోలీసులు సోషల్ మీడియాలో ఓ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో అపరిశుభ్ర పరిస్థితుల్లో తయారవుతున్న ఆహారం కనపడుతుంది. హైదరాబాద్ ఫుడ్ అడల్టేష్రన్ సర్వేలేన్స్ టీం, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, కులసుంపుర పోలీస్ సమన్వయంతో ఈ దాడి చేపట్టారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా నిర్వహించిన ఈ దాడిలో 73 ఏళ్ల అబ్దుల్ రషీద్ అనే వ్యక్తి ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా సమోసాల తయారీ యూనిట్ నిర్వహిస్తున్నట్లు బయటపడింది. అతనికి ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్, ÷ర్ సేఫ్టీ క్లియరెన్స్ ఏదీ లేకపోవడం గమనార్హం. దర్యాప్తులో భాగంగా కుళ్లిపోయిన గుడ్లు, పలుమార్లు వాడిన వంటనూనె వంటి నాసిరకం పదార్థాలతో ఆహారం తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ యూనిట్‌లో అపరిశుభ్ర పరిస్థితుల్లో సమోసాలు, ఇతర ఫుడ్ ఐటమ్స్ తయారు చేసి నగరంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తేలింది. దాడి సమయంలో సుమారు రూ.5 లక్షల విలువైన నాసిరకం ఆహార పదార్థాలు, ముడి సరుకులు, యంత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో వివిధ రకాల సమోసాలు, మైదా, స్వీట్ కార్న్ వంటి ముడి పదార్థాలు కూడా ఉన్నాయి. నిందితుడు అబ్దుల్ రషీద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేశారు. హైదరాబాద్ సిటీ పోలీసులు ఆహార కల్తీపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని సూచించారు. హోటళ్లకు సరఫరా చేసే ఆహార పదార్థాల నాణ్యతపై కఠినంగా పర్యవేక్షణ కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని మోడీ ఫోన్

**న్యూఢిల్లీ,మార్చి21 :** ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌కు ఈద్, నౌరూజ్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ కాలం పశ్చిమ ఆసియాకు శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును తీసుకువస్తుందని ఆశాభావం మోడీ వ్యక్తం చేశారు. ఇరాన్ నాయకుడితో జరిపిన ఫోన్ సంభాషణలో మోడీ ఇరాన్‌లో కీలక మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులను ఖండించారు. ఈ దాడులు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తాయని, ప్రపంచ సరఫరా గొలుసులకు అంతరాయం కలిగిస్తాయని నొక్కి చెప్పారు. నౌకాయాన స్వేచ్ఛను పరిరక్షించడం, షిప్పింగ్ మార్గాలు తెరిచి సురక్షితంగా ఉండేలా చూడాలని దాని ప్రాముఖ్యతను మోడీ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ మేరకు మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

## బస్సు ఎక్కుతుండగా ప్రమాదం

**మహిళ కలుపై నుంచి వెళ్లిన బస్సు**

**యాదగిరిగుట్ట,మార్చి21 :** హైదరాబాద్‌లోని నార్సింగ్‌కు చెందిన అనిత తన కుటుంబ సభ్యులతో కలిసి యాదగిరిగుట్టకు వచ్చింది. ఆమె తన కుటుంబ సభ్యులతో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకుంది. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో అనిత కొండపై ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా.. సడెన్‌గా ఆర్టీసీ బస్సు కదిలింది. ఈ క్రమంలో అనిత కిందపడటంతో బస్సు ఆమె కాలు మీదుగా వెళ్లింది. దీంతో అనిత కాలుకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఆమెను వెంటనే యాదాద్రి టెంపుల్ సిబ్బంది హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు.

## జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు**

**15 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు**

**ఆదిలాబాద్,మార్చి21 :** జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుడిహత్నూర్ సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఓవర్‌టేక్ చేయబోయే క్రమంలో ముందున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనతో బస్సు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ముఖ్యంగా క్యాబిన్ భాగం పూర్తిగా దెబ్బతింది. బస్సు ఆదిలాబాద్ నుండి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం 15 మంది ప్రయాణికులు గాయపడినట్లు సమాచారం. ఘటన జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని బయటకు తీసి చికిత్స కోసం ఆదిలాబాద్ లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి ఓవర్‌టేకింగ్ కారణమని ప్రాథమికంగా పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఆర్థిక వ్యవస్థపై యుద్ధ ప్రభావం

## డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పతనం

## రాబోయే ద్రవ్యోల్బణ సునామీకి సంకేతాలు: రాహుల్




**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో దేశీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. రూపాయి విలువ పతనం, ఇంధనం ధరలు పెరగడం రాబోయే ద్రవ్యోల్బణ సునామీకి సంకేతాలని అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన ఒక పోస్ట్ పెట్టారు. 'డాలర్‌తో పోల్చిస్తే రూపాయి విలువ ఆల్ టైమ్ కనిష్టానికి పడిపోయింది. త్వరలోనే అది 100 మార్క్‌ను తాకవచ్చు. పారిశ్రామిక ఇంధనం ధరల్లో స్వల్ప పెరుగుదల చోటుచేసుకుంది. ఇవి కేవలం గణాంకాలు కావు. ద్రవ్యోల్బణం పెరగబోతోందనడానికి సంకేతాలు' అని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. కరెన్సీ పతనం, ధరలు పెరుగుదల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. ఇది సాధారణ పరిస్థితి అని ప్రభుత్వం చెప్పవచ్చు కానీ వాస్తవం అందుకు భిన్నంగా ఉందని, సామాన్యుడి జేబుకు చిల్లుపడుతుందని అన్నారు. సామాన్యుడిపై నాలుగు రకాలుగా ద్రవ్యోల్బణం ప్రభావం పడుతుందని రాహుల్ పేర్కొన్నారు. వస్తువుల ఉత్పత్తి, రవాణా ఖర్చులు పెరుగుతాయని, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై (ఎంఎస్ఎంఈ) తీవ్ర ప్రభావం పడి అవి కుదేలవు తాయని, ప్రతి వస్తువు ధర పెరిగిపోతుందని, విదేశీ పెట్టుబడులు దేశం నుంచి వేగంగా తరలిపోతాయని, ఇందువల్ల స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతాయని చెప్పారు. త్వరలో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్నికలు జరగనున్నాయని, అవి పూర్తి కాగానే పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలను ప్రభుత్వం భారీగా పెంచుతుందని రాహుల్ జోస్యం చెప్పారు. కేంద్రంపై నేరుగా విరుచుపడుతూ... ఆర్థిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే స్పష్టమైన ప్రణాళిక ఏదీ కేంద్రం వద్ద లేదని అన్నారు. 'మోదీ ప్రభుత్వానికి దిశానిర్దేశం కానీ వ్యూహం కానీ లేవు. వారి వద్ద ఒట్టి మాటలే ఉన్నాయి. ప్రభుత్వం ఏమి చెబుతుందనేది కాదు..సామాన్యుడి పళ్లెంలో ఏమి మిగిలిందనేదే అసలు ప్రశ్న' అని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

# యుద్ధరీతులు మారుతున్నాయి

## యువత దేశ రక్షణకు నడుం బిగించాలి

## కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ:** నేటి రోజుల్లో యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో జరిగే ఘర్షణ మాత్రమే కాదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఆధునిక యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా దేశంలో ఆయుధ సంపత్తిని అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగానే సాయుధ దళాలకు అధునాతన, స్వదేశీ ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేశ రక్షణలో యువత కూడా తమ వంతు పాత్ర పోషించాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఎటువంటి సమస్యనైనా ఎదుర్కోగలిగేలా క్రమశిక్షణ, మానసిక దృఢత్వం పెంపొందించుకోవాలన్నారు. ప్రస్తుతం యుద్ధం సరిహద్దులను దాటిందని.. ఆర్థిక, డిజిటల్, ఇంధన, ఆహార భద్రతలు కూడా జాతీయ భద్రతలో భాగమయ్యాయని అన్నారు. వాటి ద్వారా ఒక దేశం మరో దేశాన్ని బలహీనపరిచే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రతి పౌరుడు అన్ని వేళలా దేశ రక్షణ కోసం సన్నద్ధమై ఉండాలని పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని సైనిక పాఠశాల ఆవిర్భావ దినోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్న రాజ్‌నాథ్ మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు. సైన్యం, పౌరులు బలంగా ఉన్నప్పుడే దేశం ముందడుగు వేస్తుందన్నారు. దేశ రక్షణలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)లో ప్రవేశాల సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గతంలో 17 లక్షలుగా ఉన్న నియామకాలను 20 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రజా-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) నమూనాలో దేశవ్యాప్తంగా 100 కొత్త సైనిక పాఠశాలలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సైనిక పాఠశాలల్లో బాలికలు ఎక్కువ సంఖ్యలో చేరుతుండడాన్ని చరిత్రాత్మకమైన ముందడుగు అని అభివర్ణించారు. ఈ నిర్ణయం దేశ 'నారీ శక్తి'ని మరింత బలోపేతం చేస్తోందన్నారు. బాలికా క్యాడెట్లు తమ సామర్థ్యాలను నిరంతరం నిరూపించుకుంటున్నారని, వివిధ రంగాలలో భవిష్యత్ నాయకులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు.

# యుఎన్ఐ ఆఫస్ స్వాధీనం

## జర్నలిస్టులను బయటకు పంపిన పోలీసులు

## హైకోర్టు ఆదేశాలతో కేంద్రం నిర్ణయం

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా వార్తా ఏజెన్సీ యుఎన్ఐ ఆఫీసును శుక్రవారం రాత్రి మూసివేశారు. పారామిలిటరీ దళాలు, ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా ఆ ఆఫీసుపై దాడి చేశాయి. సుమారు 50 మంది జర్నలిస్టులను ఆ ఆఫీసు నుంచి బయటకు గెంటివేశారు. భూ వివాదం నేపథ్యంలో కోర్టు ఆదేశాల ప్రకారం రఫీ మార్గ్‌లో ఉన్న యూఎన్ఐ ఆఫీసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం లాండ్ అండ్ డెవలప్మెంట్ ఆఫీసర్లకు రక్షణ కల్పించేందుకు యూఎన్ఐ సిబ్బందిని ఖాళీ చేయించినట్లు డిప్యూటీ కమిషనర్ సచిన్ శర్మ తెలిపారు. అయితే తమకు ఎటువంటి నోటీసు ఇవ్వలేదని యూఎన్ఐ తన ప్రకటనలో తెలిపింది. బలవంతంగా ఆఫీసును ఖాళీ చేయించినట్లు ఆ సంస్థ ఆరోపించింది. కొందరు ఉద్యోగులను ఈడ్చుకెళ్లారని యూఎన్ఐ పేర్కొన్నది. న్యూస్ ఏజెన్సీకి ఇచ్చిన భూకేటాయింపును రద్దు చేయడంతో శుక్రవారం రాత్రి పోలీసుల యూఎన్ఐ ఆఫీసును సీజ్ చేశారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో యూఎన్ఐ ఆఫీసును ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ చర్య పత్రికా స్వేచ్ఛపై దాడిగా యూఎన్ఐ పేర్కొన్నది. నాలుగు దశాబ్దాల క్రితం కేటాయించిన భూమిపై ఏజెన్సీ ఇంత వరకు నిర్మాణం చేపట్టలేదని హైకోర్టు తన తీర్పులో పేర్కొన్నది. 1979 భూ కేటాయింపు చట్టం ప్రకారం భూమి తీసుకున్న రెండేళ్లలోనే నిర్మాణాన్ని చేపట్టాలి, కానీ యూఎన్ఐ ఆ పనిచేయలేదని హైకోర్టు వెల్లడించింది.

# తీవ్ర రూపం దాలుస్తోన్న ఇరాన్ యుద్ధం

## దాడులను తీవ్రతరం చేసిన ఇరాన్

## హిందూ మహాసముద్రం పైకి

## బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం



**టెహ్రాన్ :** రోజురోజుకూ ఇరాన్ యుద్ధం తీవ్రరూపం దాల్చుతోంది. ఈ క్రమంలోనే హిందూ మహాసముద్రం పైకి ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఇలా ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసినట్టు తెలుస్తోంది. ఏకంగా 4 వేల కిలోమీటర్ల దూరంలోని యూఎస్, యూకేల సంయుక్త సైనిక స్థావరమే లక్ష్యంగా రెండు బాలిస్టిక్ క్షిపణుల ను ప్రయోగించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. హిందూ మహాసముద్రంలోని డియేగో గార్సియా దీవిలోగల సైనిక స్థావరంపై ఇరాన్ ఈ మిసైల్స్‌ను ప్రయోగించిందని సమాచారం. చాగోస్ ద్వీపసముదాయంలో ఇదొక భాగం. మీడియా కథనాల ప్రకారం, ఇరాన్ ప్రయోగించిన తొలి మిసైల్ మార్గమధ్యంలోనే విఫలమైంది. మరో మిసైల్‌పై ఒక అమెరికా యుద్ధ నౌక క్షిపణి విధ్వంసక రాకెట్‌ను ప్రయోగించింది. ఈ దాడిలో రెండో మిసైల్ ధ్వంసమైందా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ వార్తలపై అమెరికా ఇంకా స్పందించ లేదు. ఇప్పటివరకూ ఇరాన్ మిసైల్ దాడులు పశ్చిమాసియాకే పరిమితమయ్యాయి. తాజాగా హిందూ మహాసముద్రంలోని దీవిని ఇరాన్ టా÷-గ్గ÷ట్ చేసిందన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. ఇదే నిజమైతే ఐరోపా ఖండంలోని పలు యూఎస్ సైనిక స్థావరాలు ఇరాన్ దాడుల పరిధిలోకి వచ్చినట్టు అవుతుందని విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. ఇటీవల శ్రీలంకకు దక్షిణాన హిందూ మహాసముద్ర జలాల్లో ఒక ఇరాన్ యుద్ధ నౌకను అమెరికా సబ్‌మెరైన్ ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. టార్పిడో ప్రయోగంతో తీవ్రంగా దెబ్బతిన్న ఇరాన్ నౌక నీట మునిగిపోయింది. ఈ ఘటనలో సుమారు 85 మంది మరణించారు. భారత్‌లో జరిగిన మిలన్-2026 నావికాదళ విన్యాసాల్లో పాల్గొన్న ఇరాన్ నౌక తిరిగి వెళుతున్న సమయంలో అమెరికా దాడి చేసింది. ఇరాన్ నావికా దళాన్ని నిర్వీర్యం చేయడం తమ ప్రాథమిక లక్ష్యాల్లో ఒకటని అమెరికా జలప్పట్లో పేర్కొంది. అయితే ఈ క్షిపణులను ఎప్పుడు ప్రయోగించారన్న దానిపై స్పష్టత లేదు. డిగో గార్సియా హిందూ మహాసముద్రంలో యూఎస్-యూకేకు ఉన్న వ్యూహాత్మక సైనిక స్థావరం. హిందూ మహాసముద్రంలో 60 దీవుల సముదాయం చాగోస్. అందులో అతిపెద్దదే డిగో గార్సియా. ఆఫ్రికా, పశ్చిమాసియాలోని కార్యకలాపాల కోసం అమెరికా దీనిని ప్రధానంగా వినియోగిస్తోంది. ఇదిలాఉంటే.. హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు, ఇరాన్‌కు చెందిన ఖర్గ్ ఐలాండ్‌ను ఆక్రమించే అవకాశాలను అమెరికా పరిశీలిస్తోందని వార్తలు వస్తున్నాయి. ఆ క్రమంలోనే పశ్చిమాసియాలో మరో మూడు యుద్ధనౌకలను మోహరించేందుకు అమెరికా సిద్ధమైంది. యూఎస్ఎస్ బాక్సర్, మరో రెండు యుద్ధనౌకలు దాదాపు 2,500 మంది నౌకాదళ సిబ్బందితో పశ్చిమాసియా దిశగా వెళ్తున్నట్లు అమెరికా అధికారి ఒకరు శుక్రవారం వెల్లడించిన సంగతి తెలిసిందే. అగ్రరాజ్యానికి చెందిన యాంఫిబియస్ అసాల్ట్ షిప్ యూఎస్ఎస్ ట్రిపోలీ పశ్చిమాసియా వైపు కదులుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల వేళ..ఈ క్షిపణుల ప్రయోగం గురించి వెలుగులోకి వచ్చింది. తమవద్ద క్షిపణుల పరిధి 2000 కి.మీ. వరకు ఉంటుందని ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి వెల్లడించారు. కానీ చెప్పిన దానికంటే ఇరాన్ వద్ద ఉన్న మిస్సైళ్ల పరిధి చాలా ఎక్కువే ఉండొచ్చని తాజా ఘటన వెల్లడి చేస్తోంది.

# యుద్ధం విరమించే ఆలోచనలో ఉన్నాం

## ఇరాన్‌పై యుద్ధంలో తుది దశకు చేరుకున్నాం

## సైనిక చర్యలను తగ్గించే విషయం పరిశీలిస్తున్నాం

## ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ పోస్ట్

## ఇరాన్ చమురు అమ్మకాలపై ఆంక్షలు ఎత్తివేత



**వాషింగ్టన్:** యుద్ధంపై ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత మొదలయ్యింది. ఆయిల్ , గ్యాస్ నిల్వలు తగ్గడం, రవాణ్గా ఆగిపోవడంతో ప్రపంచ దేశాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో యుద్ధం ఆగాలని అంతా కోరుకుంటున్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధ జ్వాలలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో ఇరాన్‌తో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అయితే, కాల్పుల విరమణకు మాత్రం తాను సిద్ధంగా లేనని పేర్కొనడం గమనార్హం. ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. ఇరాన్‌పై మా లక్ష్యాలను చేరుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. మా సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ దేశ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నావికా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారుచేయకుండా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగినవిధంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇక, అమెరికా దాని మిత్ర దేశాలకు భద్రత కల్పించిందని ట్రంప్ అన్నారు. 'ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ సహా పశ్చిమాసియాలోని మిత్ర దేశాలకు అత్యున్నత స్థాయిలో రక్షణ కల్పిస్తున్నాం' అని రాసుకొచ్చారు.

ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. దీనిపై ఆధారపడిన దేశాలు నౌకల సురక్షిత ప్రయాణానికి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా రక్షణ కల్పించదని స్పష్టం చేశారు. ఒకవేళ తమ సాయం కోరితే.. సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇరాన్ ముప్పు తొలగిపోయిన తర్వాత ఆ అవసరం ఉండదన్నారు. ఇకపోతే యుద్ధం నేపథ్యంలో ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశ చమురు అమ్మకాలకు 30 రోజుల మినహాయింపు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ విషయాన్ని ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ తాత్కాలిక చర్యతో 14 కోట్ల బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి వస్తుందన్నారు. ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయించడానికి మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయని స్పష్టంచేశారు. అమెరికా మినహాయింపులపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు ముడి చమురు లేదని టెహ్రాన్ తెలిపింది. ఈ మేరకు ఇరాన్ ఇంధన మంత్రిత్వశాఖ ప్రతినిధి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకే యూఎస్ ఇలాంటి ప్రకటన చేసిందన్నారు.

# గో సంరక్షకుడు చంద్రశేఖర్ మృతి

## ప్రమాదంలో చనిపోయాడన్న పోలీసులు

## హత్య చేశారంటూ స్థానికుల ఆందోళన

## జాతీయ రహదారి దిగ్బంధనం...ఉద్రిక్తత



**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లోని మథురలో శనివారంనాడు తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. గో సంరక్షకుడు చంద్రశేఖర్ మృతిని ఖండిస్తూ స్థానికులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. గోవుల స్మగ్లింగ్‌ను అనుమానించి ఒక ట్రక్కును వెంబడిస్తుండగా అది ఆయన బైకును ఢీకొట్టిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో ఫర్సా వాలే బాబాగా పేరున్న చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతిచెందారు. దీంతో కోసి కలాన్ ఏరియాలో జాతీయ రహదారిని గో సంరక్షకులు దిగ్బంధించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ-ఆగ్రా రహదారిపై ఆందోళనలు చోటుచేసుకోవడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అక్కడకు చేరుకున్న పోలీసులు, వారి వాహనాలపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. అయినప్పటికీ ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఆందోళనకారుల్ని పోలీసులు చెదరగొట్టే ప్రయత్నం చేశారు. అయితే నిరసకారులు తిరగబడడంతో.. ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటన జరిగిన ప్రాంతంలో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు భారీగా మోహరించారు .ఘటనపై మథుర ఎస్ఎస్పీ మాట్లాడుతూ, గోవులను స్మగ్లింగ్ చేస్తున్నారనే అనుమానంతో కంటైనర్ ట్రక్కును బాబా అడ్డుకున్నారని, దట్టమైన మంచు కారణంగా ఆయన బైక్‌ను ట్రక్కు ఢీకొందని తెలిపారు. ట్రక్కులో వైర్లు, రేషన్ సరుకులు ఉన్నాయని, డ్రైవర్, హెల్పర్‌ను ప్రశ్నిస్తున్నామని చెప్పారు. గోవుల స్మగ్లింగ్‌తో ఈ ఘటనకు సంబంధం ఉన్నట్టు అనిపించడం లేదని, రోడ్డు ప్రమాదంగానే కనిపిస్తోందని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరుపుతున్నామని చెప్పారు. ఫార్సా వాలే బాబా మృతికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర సంతాపం తెలిపారు. తక్షణం ఘటనా స్థలికి వెళ్లి బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 'నేరస్థుల ప్రమేయం ఏమాత్రం ఉన్నా క్షమించి విడిచిపెట్టేది లేదు' అని సీఎంఓ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

# మరింత దిగిన బంగారం ధరలు

## 24 క్యారెట్ పై 2,940 రూపాయలు తగ్గుదల

**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితుల కారణంగా భారత దేశంలో బంగారం ధరలు రోజురోజుకు భారీగా తగ్గుతున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. మార్చ్ 20న హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,910 రూపాయలు.. 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,36,550 రూపాయలు ఉండింది. అయితే శనివారం బంగారం ధరలు భారీగా తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ బంగారంపై 2,940 రూపాయలు.. 22 క్యారెట్ బంగారంపై 2,750 రూపాయలు తగ్గింది. ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,970 రూపాయల దగ్గర.. 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,33,800 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. బంగారం మాదిరిగానే వెండి ధరలు కూడా భారీగా పతనం అయ్యాయి. నిన్న కిలో వెండి 2,60,000 రూపాయల దగ్గర.. 100 గ్రాముల వెండి 26,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు కిలోపై 10 వేల రూపాయలు.. 100 గ్రాములపై వెయ్యి రూపాయలు తగ్గింది. ప్రస్తుతం కిలో వెండి 2,50,000 రూపాయల దగ్గర, 100 గ్రాముల వెండి 25 వేల రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.



## కామెంటరీకి శివరామకృష్ణన్ గుడ్‌బై..
# వర్ణ వివక్షే కారణమా?

భారత మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్ తన కామెంటరీ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించి సంచలనం సృష్టించాడు. దాదాపు 23 ఏళ్లుగా వ్యాఖ్యాతగా కొనసాగుతున్న తనను పక్కన పెట్టడానికి 'వర్ణ వివక్ష' కూడా ఒక కారణమని ఆయన ఆరోపించడం క్రీడా వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా శుక్రవారం తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించిన ఆయన, ఆ తర్వాత మరికొన్ని పోస్టులు చేశాడు. "గత 23 ఏళ్లుగా నన్ను టాస్‌లకు, ప్రజెంటేషన్ కార్యక్రమాలకు ఉపయోగించుకోలేదు. కొత్తగా వచ్చిన వారు పిచ్ రిపోర్టులు, ప్రజెంటేషన్లు చేస్తున్నారు. దీనికి కారణం ఏమై ఉంటుందని మీరు భావిస్తున్నారు?" అని ప్రశ్నించాడు. ఆయన పోస్టుకు ఒక నెటిజన్ స్పందిస్తూ, "బహుశా మీరు నల్లగా ఉండటం వల్లేమో" అని కామెంట్ చేశారు. దానికి శివరామకృష్ణన్ "మీరు చెప్పింది నిజమే. వర్ణ వివక్ష" అని బదులివ్వడం వివాదాన్ని మరింత పెంచింది. ఈ వ్యాఖ్యలు వైరల్ కావడంతో ఇవాళ శివరామకృష్ణన్ మరోసారి స్పందిస్తూ తన ఆవేదన బీసీసీఐ మొత్తం పాలకవర్గంపై కాదని స్పష్టం చేశాడు. ఇది బీసీసీఐలోని ఒక ఉద్యోగితో తనకు ఉన్న వ్యక్తిగత సమస్య అని, ఈ వివాదంలో బీసీసీఐ కార్యదర్శి జై షాకు ఎలాంటి సంబంధం లేదని తెలిపాడు. తన జీవితంపై తనకు నియంత్రణ తీసుకునే హక్కు ఉందని పేర్కొన్నాడు. శివరామకృష్ణన్ ఆకస్మిక నిర్ణయంపై భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ స్పందిస్తూ, "ఓహ్ నో! ఈ ఐపీఎల్‌కు ఎందుకు ఉండరు?" అని ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. 2000వ సంవత్సరంలో కామెంటరీ కెరీర్ ప్రారంభించిన శివరామకృష్ణన్, అంతకుముందు ఐసీసీ క్రికెట్ కమిటీలో ఆటగాళ్ల ప్రతినిధిగా కూడా పనిచేశాడు. 1984లో ఇంగ్లండ్‌పై ఒకే మ్యాచ్‌లో 12 వికెట్లు పడగొట్టి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించిన శివరామకృష్ణన్, 1985లో సునీల్ గవాస్కర్ కెప్టెన్సీలో భారత్ గెలిచిన బెన్సన్ అండ్ హెడ్జెస్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కీలక పాత్ర పోషించాడు. ఆ టోర్నమెంట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచి సత్తా చాటాడు.



## పాక్ కోచ్‌గా చేదు అనుభవం..
### తొలిసారి నోరు విప్పిన గ్యారీ కిర్‌స్టెన్

భారత్‌కు 2011లో వన్డే ప్రపంచకప్ అందించిన కోచ్ గ్యారీ కిర్‌స్టెన్, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) పనితీరుపై సంచలన ఆరోపణలు చేశాడు. పాకిస్థాన్ జట్టుకు హెడ్ కోచ్‌గా తన కొద్దికాలపు అనుభవాన్ని వివరిస్తూ.. పీసీబీ నుంచి తాను ఊహించని స్థాయిలో జోక్యాన్ని ఎదుర్కొన్నానని, తన కెరీర్‌లో ఇంతటి జోక్యాన్ని ఎప్పుడూ చూడలేదని తొలిసారి నోరు విప్పాడు. 2024 ఏప్రిల్‌లో రెండేళ్ల కాంట్రాక్ట్‌పై పాకిస్థాన్ జట్టుకు హెడ్ కోచ్‌గా నియమితుడైన కిర్‌స్టెన్, కేవలం ఆరు నెలలకే అక్టోబర్‌లో తన పదవికి రాజీనామా చేశారు. ఆటగాళ్ల ఎంపిక విషయంలో మొహ్సిన్ నఖ్వీ నేతృత్వంలోని పీసీబీతో వచ్చిన విభేదాలే ఇందుకు కారణమని అప్పట్లో వార్తలు వచ్చాయి. తాజాగా 'టాక్‌స్పోర్ట్ క్రికెట్' అనే మీడియాతో మాట్లాడుతూ తన రాజీనామా వెనుక ఉన్న కారణాలను కిర్‌స్టెన్ బయటపెట్టాడు. "నన్ను అన్నింటికంటే ఎక్కువగా ఆశ్చర్యపరిచింది బోర్డు జోక్యమే. ఆ స్థాయిలో జోక్యం ఉంటుందని నేను ఊహించలేదు. బయటి నుంచి నిరంతరం వినిపించే మాటలు, ఒత్తిడి మధ్య ఒక కోచ్ ఆటగాళ్లతో కలిసి పనిచేయడం చాలా కష్టం. జట్టు సరిగా రాణించనప్పుడు పేలవమైన ప్రదర్శనలపై కఠిన చర్యలు తీసుకోవడం వంటివి జరిగాయి. జట్టు విఫలమైనప్పుడు నింద మోపడానికి కోచ్ సులువుగా దొరుకుతాడు. కోచ్‌ను తొలగించడం లేదా అతనిపై ఆంక్షలు పెట్టడం వంటివి చేస్తారు. ఇది ఏమాత్రం సరైన పద్ధతి కాదు. అలాంటప్పుడు అసలు కోచ్‌ను ఎందుకు నియమించుకోవాలి?" అని కిర్‌స్టెన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. పాకిస్థాన్‌తో తన ప్రయాణాన్ని ముగించిన కిర్‌స్టెన్, ప్రస్తుతం శ్రీలంక జాతీయ జట్టుకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. 2026 ఏప్రిల్ 15 నుంచి ఆయన రెండేళ్ల కాంట్రాక్ట్‌పై శ్రీలంక జట్టుతో పనిచేయనున్నాడు. ఈ ఒప్పందం 2028 ఏప్రిల్ 14 వరకు కొనసాగుతుంది. ప్రధానంగా 2027లో దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యమిచ్చే వన్డే ప్రపంచకప్ కోసం శ్రీలంక జట్టును సిద్ధం చేయడమే కిర్‌స్టెన్ ముందున్న లక్ష్యం. అంతకుముందు ఆయన నమీబియా క్రికెట్ జట్టుకు కన్సల్టెంట్‌గా కూడా సేవలందించాడు. దక్షిణాఫ్రికా మాజీ ఓపెనర్‌గా సుదీర్ఘకాలం ఆడిన కిర్‌స్టెన్, టెస్టులు, వన్డేల్లో కలిపి 14,000 పైగా పరుగులు సాధించాడు. ఆ తర్వాత కోచ్‌గా మారి భారత్, దక్షిణాఫ్రికా వంటి జట్లకు విజయవంతంగా మార్గనిర్దేశం చేశాడు.

# ఒక్క నిమిషం కూడా వృథా చేయొద్దు
## 120 శాతం కష్టపడాలి: సహచరులకు కోహ్లీ పిలుపు

క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీఎల్ 2026 సీజన్‌కు రంగం సిద్ధమైంది. ఈ మెగా టోర్నీ ఈ నెల 28న ప్రారంభం కానుంది. బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో జరిగే ఆరంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) జట్లు తలపడనున్నాయి. గతేడాది తమ తొలి టైటిల్ గెలిచిన ఆర్‌సీబీ, ఈసారి కూడా అదే జోరును కొనసాగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కీలక పోరుకు ముందే ఆర్‌సీబీ స్టార్ ఆటగాడు, భారత బ్యాటింగ్ ఐకాన్ విరాట్ కోహ్లీ ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. నెట్స్‌లో అతడు ఆడుతున్న పవర్‌ఫుల్ షాట్లకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. గత మూడు సీజన్లలోనూ 600కు పైగా పరుగులు సాధించిన కోహ్లీ, ఈసారి కూడా జట్టుకు కీలకం కానున్నాడు. ఈ సందర్భంగా సహచరులలో స్ఫూర్తి నింపుతూ కోహ్లీ మాట్లాడాడు. "గతేడాది మనం సాధించిన విజయం కోసం గత రెండు, మూడు సీజన్లుగా చాలా కష్టపడ్డాం. ఈసారి ఇతర జట్లు మనపై గట్టిగా పోరాడతాయి కాబట్టి పోటీ మరింత కఠినంగా ఉంటుంది. ఈ సమయాన్ని వృథా చేయొద్దు. ప్రతీ సెషన్‌లోనూ ఒక్క నిమిషం కూడా వృథా చేయకుండా 120 శాతం కష్టపడాలి. ఛాలెంజర్లుగా బరిలోకి దిగేందుకు మనమంతా ఉత్సాహంగా ఉన్నామని అందరి ముఖాల్లో కనిపిస్తోంది" అని కోహ్లీ తన సహచరులకు పిలుపునిచ్చాడు. 2025లో అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఫైనల్‌లో పంజాబ్ కింగ్స్‌ను ఆరు పరుగుల తేడాతో ఓడించి ఆర్‌సీబీ తమ తొలి ఐపీఎల్ ట్రోఫీని



గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జట్టు కూర్పుపై హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్ స్పందించాడు. "వేలం ఆసక్తికరంగా సాగింది. మా స్క్వాడ్‌ను మరింత మెరుగుపరుచుకున్నామని చెప్పగలను. జట్టులోకి కొందరు ఆటగాళ్లు వచ్చారు. విరాట్, రజత్ వంటి సీనియర్లతో పాటు కొత్త ఆటగాళ్లను జట్టులో కలపడం ద్వారా కొత్త జట్టును నిర్మించడం ఉత్సాహంగా ఉంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశాడు.

### రికార్డుపై కన్నేసిన కోహ్లీ

ఇప్పటివరకు 267 మ్యాచ్‌లలో 8 సెంచరీలు, 63 అర్ధ సెంచరీలతో మొత్తం 8,661 పరుగులు చేసిన విరాట్ కోహ్లీ, ఈ సీజన్‌లో మరో అరుదైన మైలురాయిపై కన్నేశాడు. ఐపీఎల్ చరిత్రలో 9,000 పరుగుల మార్కును అందుకున్న తొలి ఆటగాడిగా నిలిచేందుకు అతను అడుగు దూరంలో ఉన్నాడు.

## ఐపీఎల్ ప్రారంభానికి ముందు
# కోల్‌కతా నైట్ రైడర్స్‌కు మరో ఎదురుదెబ్బ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ ఆరంభానికి ముందే మూడుసార్లు ఛాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్ (KKR)కు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు కీలక ఫాస్ట్ బౌలర్, టీమిండియా పేసర్ ఆకాశ్ దీప్ గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. దీంతో ఇప్పటికే పేస్ బౌలింగ్ వనరుల కొరతతో ఇబ్బంది పడుతున్న కేకేఆర్ సమస్యలు మరింత తీవ్రమయ్యాయి. గత ఏడాది జరిగిన మినీ వేలంలో ఆకాశ్ దీప్‌ను కోల్‌కతా యాజమాన్యం రూ.1 కోటి కనీస ధరకు కొనుగోలు చేసింది. అయితే, వెన్నునొప్పి (స్ట్రెస్ రియాక్షన్) కారణంగా అతడు ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆడటం లేదని ఫ్రాంచైజీ వర్గాలు శనివారం స్పష్టం చేశాయి. రంజీ ట్రోఫీ సెమీఫైనల్ మ్యాచ్ సందర్భంగా అతడు ఈ గాయం బారినపడినట్లు తెలుస్తోంది. గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి దాదాపు 6 నుంచి 12 వారాల సమయం పట్టే అవకాశం ఉంది. మార్చి 18న కోల్‌కతాలో ప్రారంభమైన జట్టు ప్రీ-సీజన్ క్యాంపునకు కూడా ఆకాశ్ హాజరు కాలేదు. ఇప్పటికే కేకేఆర్ బౌలర్లు



హర్షిత్ రాణా సర్జరీతో, శ్రీలంక పేసర్ మతీశ పతిరణ భుజం గాయంతో జట్టుకు దూరమయ్యారు. పతిరణ ఆడే విషయంపై శ్రీలంక క్రికెట్ బోర్డు నుంచి ఇంకా అనుమతి రాలేదు. తాజా పరిణామంతో కేకేఆర్ పేస్ బౌలింగ్ విభాగం మరింత బలహీనపడింది. ప్రస్తుతం జట్టులో వైభవ్ అరోరా, ఉమ్రాన్ మాలిక్, బ్లెస్సింగ్ ముజరబానీ, కార్తీక్ త్యాగి మాత్రమే స్పెషలిస్ట్ పేసర్లుగా ఉన్నారు. ఖాళీ అయిన స్థానాలను భర్తీ చేసేందుకు కేకేఆర్ యాజమాన్యం ఇప్పటికే ఈడెన్ గార్డెన్స్‌లో ట్రయల్స్ నిర్వహిస్తోంది. నవదీప్ సైనీ, ఆకాశ్ మధ్వాల్, సిమర్‌జీత్ సింగ్ వంటి బౌలర్లను పరిశీలిస్తోంది. కేకేఆర్ తమ తొలి మ్యాచ్‌ను మార్చి 29న ముంబైలోని వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్‌తో ఆడనుంది.

## 2027 వన్డే వరల్డ్ కప్‌కు
# సీఈవో, సీఓఓల నియామకం

2027లో జరగనున్న ఐసీసీ పురుషుల వన్డే ప్రపంచకప్‌కు సంబంధించి కీలక నియామకాలు జరిగాయి. టోర్నమెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా కొండిసా గ్వెన్యా, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ)గా ఎడ్వర్డ్ ఖోజా నియమితులయ్యారు. ఈ విషయాన్ని స్థానిక ఆర్గనైజింగ్ కమిటీ (ఎల్‌ఓసీ) శనివారం అధికారికంగా ప్రకటించింది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు ఈ మెగా టోర్నీకి సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ నియామకాలపై ఆర్గనైజింగ్ కమిటీ బోర్డు ఛైర్మన్ ట్రెవర్ మాన్యువల్ హర్షం వ్యక్తం చేశారు. "కొండిసా, ఎడ్వర్డ్‌లకు స్వాగతం. ఇంత భారీ క్రీడా ఈవెంట్‌ను విజయవంతంగా నిర్వహించగల నైపుణ్యం, అనుభవం వారికి ఉన్నాయి. వారి సామర్థ్యంపై మాకు పూర్తి నమ్మకం ఉంది" అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామక ప్రక్రియకు మద్దతిచ్చిన క్రికెట్ సౌత్ ఆఫ్రికాకు, ఆమోదం తెలిపిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)కి ఆయన ధన్యవాదాలు తెలిపారు. 2027 అక్టోబర్, నవంబర్ నెలల్లో ఈ 14వ ఎడిషన్ వన్డే ప్రపంచకప్ జరగనుంది. 2003 తర్వాత దక్షిణాఫ్రికా, జింబాబ్వేలు ఈ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వడం ఇది రెండోసారి కాగా, నమీబియా తొలిసారిగా ప్రపంచకప్ మ్యాచ్‌లకు వేదిక కానుంది. టోర్నీలోని 44 మ్యాచ్‌లు దక్షిణాఫ్రికాలో, మిగిలిన 10 మ్యాచ్‌లు జింబాబ్వే, నమీబియాలలో జరుగుతాయి. ఆతిథ్య దేశాలుగా దక్షిణాఫ్రికా, జింబాబ్వేలకు టోర్నీలో నేరుగా ప్రవేశం లభిస్తుంది. 2027 మార్చి 31 నాటికి వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-8లో నిలిచే జట్లు కూడా నేరుగా అర్హత సాధిస్తాయి. మిగిలిన నాలుగు స్థానాల కోసం క్వాలిఫయింగ్ టోర్నమెంట్ నిర్వహిస్తారు. అయితే, సహ-ఆతిథ్య దేశమైనప్పటికీ, ఐసీసీలో పూర్తిస్థాయి సభ్యదేశం కాకపోవడంతో నమీబియా తప్పనిసరిగా క్వాలిఫయర్స్ ఆడి అర్హత సాధించాల్సి ఉంటుంది.

# భారత్-ఐర్లాండ్ టీ20 సిరీస్ షెడ్యూల్ ఖరారు

టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచిన భారత క్రికెట్ జట్టు తన తదుపరి సిరీస్‌కు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ఐర్లాండ్‌తో రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను బీసీసీఐ ప్రకటించింది. ఈ సిరీస్‌లోని రెండు మ్యాచ్‌లు బెల్‌ఫాస్ట్ వేదికగా జూన్ 26, 28 తేదీల్లో జరుగుతాయి. 2026 టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత భారత జట్టు ఆడబోయే తొలి టీ20 సిరీస్ ఇదే కావడం విశేషం. ఐపీఎల్ 2026 ముగిసిన అనంతరం టీమిండియా తొలుత ఆఫ్ఘనిస్థాన్‌తో ఒక టెస్టు, మూడు వన్డేల సిరీస్‌లో తలపడనుంది. జూన్ 20న వన్డే సిరీస్ ముగిసిన వెంటనే భారత జట్టు ఐర్లాండ్ పర్యటనకు బయలుదేరుతుంది. ఈ సిరీస్ పూర్తికాగానే జులై 1 నుంచి ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ ప్రారంభమవుతుంది. "సీనియర్ పురుషుల జట్టు 2026 జూన్‌లో ఐర్లాండ్‌లో రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం పర్యటిస్తుంది" అని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. గత ఎనిమిదేళ్లలో భారత్ మూడుసార్లు (2018, 2022, 2023) ఐర్లాండ్‌లో పర్యటించినప్పటికీ 2007 తర్వాత బెల్‌ఫాస్ట్‌లో ఆడటం ఇదే తొలిసారని బోర్డు వివరించింది. మరోవైపు ఐర్లాండ్ జట్టు కూడా తీరిక లేకుండా అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుంది. న్యూజిలాండ్‌తో చారిత్రక టెస్టు మ్యాచ్, భారత్‌తో సిరీస్, ఆ తర్వాత ఆగస్టులో ఆఫ్ఘనిస్థాన్‌తో ఐదు వన్డేల సిరీస్ ఆడనుంది.



### భారత్ - ఐర్లాండ్ సిరీస్ షెడ్యూల్:

మొదటి టీ20: జూన్ 26 (బెల్‌ఫాస్ట్, భారత కాలమానం ప్రకారం రాత్రి 7:30 గంటలకు)

రెండో టీ20: జూన్ 28 (బెల్‌ఫాస్ట్, భారత కాలమానం ప్రకారం రాత్రి 7:30 గంటలకు)



# పెళ్లి పీటలెక్కిన పునర్నవి భూపాలం

బిగ్ బాస్ ఫేమ్, 'ఉయ్యాల జంపాల' నటి పునర్నవి భూపాలం ఓ ఇంటికి కోడలు అయ్యింది. గత కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటూ విదేశాల్లో చదువుకుంటున్న ఈ బ్యూటీ, తాజాగా వివాహ బంధంలోకి అడుగుపెట్టి అందరినీ సర్ప్రైజ్ చేసింది. తన చిరకాల మిత్రుడు, హేమంత్ వర్మతో కలిసి కొత్త జీవితాన్ని ప్రారంభించింది. అత్యంత సన్నిహితుల మధ్య సింపుల్‌గా జరిగిన ఈ పెళ్లి ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఆ విశేషాలు చూద్దాం.. పునర్నవి భూపాలం తన ప్రియుడు హేమంత్ వర్మను మార్చి 20న వివాహం చేసుకుంది. హేమంత్ వర్మ ఇండస్ట్రీలో ప్రముఖ ఫోటోగ్రాఫర్‌గా గుర్తింపు పొందారు. వీరిద్దరూ చాలా కాలంగా ప్రేమలో ఉన్నప్పటికీ, ఆ విషయాన్ని ఎక్కడా బయటపెట్టలేదు. గత డిసెంబర్‌లో నిశ్చితార్థం చేసుకున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచిన ఈ జోడీ, ఇప్పుడు అంతే సింపుల్‌గా పెళ్లి పీటలెక్కింది. ఆర్భాటాలకు పోకుండా కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత ఆత్మీయుల మధ్య ఈ వేడుకను నిర్వహించుకున్నారు. రాజ్ తరుణ్ నటించిన 'ఉయ్యాల జంపాల' సినిమాలో సునీత పాత్రతో పునర్నవి తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యింది. ఆ సినిమాలో తన అమాయకత్వంతో, పల్లెటూరి పిల్లగా అందరినీ ఆకట్టుకుంది. ఆ తర్వాత కొన్ని సినిమాలు చేసినప్పటికీ, ఆమెకు అసలైన క్రేజ్ తెచ్చింది మాత్రం 'బిగ్ బాస్' రియాలిటీ షోనే. అందులో తన ముక్కుసూటి తనంతో, బోల్డ్ నేచర్‌తో ఫ్యాన్ ఫాలోయింగ్‌ను భారీగా పెంచుకుంది. ఆ షో తర్వాత ఆమె కెరీర్ మలుపు తిరుగుతుందని అందరూ అనుకున్నారు. పెళ్లి తర్వాత పునర్నవి మళ్లీ కెమెరా ముందుకు వస్తుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఆమె ఫోటోలు నెట్టింట వైరల్ అవుతుండటంతో అభిమానులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. "చూడముచ్చటైన జంట" అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన పునర్నవి, తన చదువు పూర్తయ్యాక తిరిగి సినిమాల్లో నటిస్తుందో లేదో వేచి చూడాలి. ప్రస్తుతం మాత్రం ఆమె పెళ్లి వేడుకలో మునిగిపోయి ఉంది.



# దర్శకులను సూపర్‌స్టార్లు తొక్కేస్తున్నారు

## కంగనా రనౌత్ తీవ్ర వ్యాఖ్యలు

వివాదాస్పద అంశాలపై కూడా సూటిగా, స్పష్టంగా తన అభిప్రాయాలను వెల్లడించే నటి, రాజకీయ నాయకురాలు కంగనా రనౌత్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. భారతీయ సినీ పరిశ్రమలో సూపర్‌స్టార్లు ఫిల్మ్‌మేకర్లను వేధిస్తారని, వారిని బెదిరింపులకు గురిచేస్తారని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. తన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో ఈ విషయంపై ఆమె గళం విప్పారు. హాలీవుడ్‌లో ప్రముఖ నటుల కంటే దర్శకులకే ఎక్కువ పేరు, గౌరవం ఉంటాయని, కానీ బాలీవుడ్‌లో పరిస్థితి దానికి పూర్తి భిన్నంగా ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఘన విజయం సాధించిన 'ధురంధర్ 2' చిత్రం సందర్భంగా దర్శకుడు ఆదిత్య ధర్‌ను ప్రశంసిస్తూ కంగనా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఒక సుదీర్ఘమైన నోట్ రాశారు. భారతీయ చిత్ర పరిశ్రమలో దర్శకులు, ఇతర సాంకేతిక నిపుణులు తీవ్రమైన శ్రమకు గురవుతారని, కానీ వారికి సరైన పారితోషికం గానీ, గుర్తింపు గానీ లభించడం లేదని ఆమె పేర్కొన్నారు. "ధురంధర్ విజయంలో గొప్ప విషయం ఏమిటంటే, ఆదిత్య ధర్ ఒక సూపర్‌స్టార్ డైరెక్టర్‌గా స్థిరపడటం. స్పీల్‌బర్గ్, టరంటినో, నోలన్ వంటి హాలీవుడ్ సూపర్‌స్టార్ దర్శకులకు ఎప్పుడూ అక్కడి నటుల కన్నా అధిక ప్రాధాన్యత ఉంటుంది. కానీ మనం మన ఫిల్మ్‌మేకర్లకు తగినంత గౌరవం ఇవ్వం" అని కంగనా వ్యాఖ్యానించారు. "దర్శకులు అధిక శ్రమకు గురవుతూ, తక్కువ వేతనం పొందుతూ సూపర్‌స్టార్ల చేతిలో వేధింపులకు గురవుతున్నారు. దీని ఫలితంగానే, ఫిల్మ్‌మేకర్ కావాలని లేదా సినిమాటోగ్రాఫర్ అవ్వాలని కలలు కనే య-ువతను నేను ఎప్పుడూ కలవలేదు. ప్రతి ఒక్కరూ తమకు టాలెంట్ ఉందని చెప్పుకుంటారు, కానీ అందరూ నటులు కావాలనే కోరుకుంటారు. ఇక్కడ ఏ హీరో కన్నా ప్రకాశవంతంగా వెలిగిపోతున్న ఒక సూపర్‌స్టార్ ఫిల్మ్‌మేకర్ (ఆదిత్య ధర్) ఉన్నారు. ఇప్పుడు ఎందరో యువకులు ఆయన కథను చూసి, ఆయనలాగే ఎదగాలని ఆకాంక్షిస్తారు. సినీ పరిశ్రమను ఉన్నత శిఖరాలకు తీసుకెళతారు. ఆదిత్య ధర్... మీకు నా వందనాలు" అని కంగనా తన పోస్టులో రాసుకొచ్చారు. ఈ పోస్టులో దర్శకుడు ఆదిత్య ధర్‌పై ప్రశంసల వర్షం కురిపించిన కంగనా, చిత్ర కథానాయకుడు రణ్‌వీర్ సింగ్‌ను గానీ, ఇతర నటీనటులను గానీ ట్యాగ్ చేయకపోవడం గమనార్హం.

# హీరోలపై తాప్సీ పన్ను మరోసారి..!

సినిమా పరిశ్రమలో హీరోయిన్లు అంటే కేవలం పాటలకే పరిమితం కావాలనే ధోరణి ఇంకా కొనసాగుతుండటంపై నటి తాప్సీ పన్ను తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. కథకు ప్రాధాన్యమిచ్చి తమ పాత్ర పరిధి ఎంత ఉన్నా నటించే జెన్యూన్ హీరోలు ప్రస్తుతం లేరని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. హీరోయిన్ పాత్రకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటే నటించేందుకు చిన్న హీరోలు కూడా ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ హీరోయిన్ హైలైట్ అయితే తమ ఇమేజ్ దెబ్బతింటుందనే అభద్రతాభావం హీరోలలో గూడుకట్టుకుని ఉందని ఆమె సూటిగా విమర్శించారు. నేటి తరంలో బాలీవుడ్ నటి కంగనా రనౌత్ తర్వాత అంత గట్టిగా తన గొంతు వినిపిస్తున్న నటిగా తాప్సీ గుర్తింపు పొందారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా తన మనస్తత్వానికి తగ్గట్టుగానే నాయికా ప్రాధాన్యత ఉన్న స్క్రిప్టులనే ఎంపిక చేసుకుంటున్నారు. పింక్, నామ్ షబానా వంటి సినిమాలు ఈ కేటగిరీలోకే వస్తాయి. చాలా మంది కథానాయికలు హీరోలను ముఖస్తుతి కోసం పొగుడుతూ అవకాశాలు దక్కించుకోవాలని చూస్తుంటే తాప్సీ మాత్రం అందుకు భిన్నంగా హీరోల ఆలోచనా విధానంపై -దురంధర ఎటాక్- చేస్తున్నారు. మంచి కథలు రావాలంటే హీరోలు పాతకాలపు ఆలోచనల నుంచి బయటకు రావాలని తాప్సీ పిలుపునిచ్చారు. కథానాయికలు కేవలం గ్లామర్ కోసమే ఉండాలనే పాత ఆలోచనలను వీడి కథకు ఏది అవసరమో దానిని గౌరవించాలని తాప్సీ డిమాండ్ చేశారు. సినిమాలో హీరోయిన్ పాత్ర బలంగా ఉంటే హీరోల ఇమేజ్ ఎక్కడ తగ్గిపోతుందో అనే భయంతో కథలను తిరస్కరించడం వల్ల అద్భుతమైన స్క్రిప్టులు మరుగున పడిపోతున్నాయని అభిప్రాయపడ్డారు. తన పాత్ర నిడివి కంటే కథ గొప్పతనాన్ని చూసే హీరోల అవసరం ఇండస్ట్రీకి ఎంతైనా ఉందని డ్యాషింగ్ గా మాట్లాడారు. ఇలా హీరోసామ్యాన్ని నిరంతరం ప్రశ్నించడం వల్ల తాప్సీకి అగ్ర హీరోల సరసన కమర్షియల్ సినిమాల్లో అవకాశాలు తగ్గాయా? అనే చర్చ కూడా సినీ వర్గాల్లో ప్రస్తుతం సాగుతోంది. సాధారణంగా స్టార్ హీరోలు తమ సినిమాల్లో హీరోయిన్ల పాత్ర కేవలం పాటలకే పరిమితం కావాలని కోరుకుంటారు. కానీ తాప్సీ వంటి నటి తన పాత్రకు ప్రాముఖ్యత లేకపోతే అటువంటి సినిమాలను తిరస్కరించడం వల్ల పెద్ద హీరోల సినిమాల్లో ఛాన్సులు రావడం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఏది ఏమైనా తగ్గేదేలే.. అంటూ తన పంథాను మార్చుకోకుండా నాయికా ప్రాధాన్యత ఉన్న చిత్రాల కోసమే తాప్సీ వేచి చూస్తున్నారు.





# ట్రెండీ లుక్‌తో అదరగొట్టిన అనన్య నాగళ్ళ

టాలీవుడ్ చందమామ అనన్య నాగళ్ల ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. 'మల్లేశం' సినిమాలో పద్ధతైన పల్లెటూరి అమ్మాయిగా మెప్పించిన ఈ బ్యూటీ, ఇప్పుడు రూటు మార్చింది. తన గ్లామర్ డోస్ పెంచుతూ నెట్టింట సెగలు రేపుతోంది. తాజాగా అనన్య తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన హాట్ ఫోటోలు చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. కుర్రకారు గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న ఈ తెలుగమ్మాయి లేటెస్ట్ గ్లామర్ హంగామా ఏంటో ఇప్పుడు చూద్దాం. అనన్య నాగళ్ల తన తాజా ఫోటో షూట్‌తో ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. ఈసారి ఆమె ఎంచుకున్న ట్రెండీ డ్రెస్ చూస్తే ఎవరైనా సరే వావ్ అనాల్సిందే. ఈ డ్రెస్ షార్ట్ వేసి, అదిరిపోయే పోజులిచ్చింది. గతంలో చీరకట్టులో మెరిసిన ఈ భామ, ఇప్పుడు మోడ్రన్ లుక్‌లో తనలోని హాట్ యాంగిల్‌ను బయటపెట్టింది. ఈ ఫోటోలు చూస్తుంటే అనన్య గ్లామర్ రేసులో స్పీడ్ పెంచిందని అర్థమవుతోంది. ఆమె షేర్ చేసిన కొద్దిసేపటికే ఈ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సాధారణంగా తెలుగు హీరోయిన్లు అంటే కేవలం పద్ధతిగా ఉంటారనే ముద్ర ఉంటుంది. కానీ అనన్య దాన్ని చెరిపేస్తోంది. 'మల్లేశం', 'వకీల్ సాబ్' వంటి సినిమాల్లో నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు చేసిన ఈ అమ్మడు, ఇప్పుడు కమర్షియల్ సినిమాల్లో గ్లామర్ రోల్స్ కోసం సిద్ధంగా ఉన్నానని చెప్పకనే చెబుతోంది. తన సహజమైన అందం, ఆకట్టుకునే నవ్వుకి ఈ గ్లామర్ టచ్ తోడవ్వడంతో ఆమె ఫాలోయింగ్ అమాంతం పెరిగిపోయింది. నెటిజన్లు కూడా "మా తెలుగమ్మాయి మజాకా!" అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు.

# దళారీ వ్యవస్థ నుండి రైతుల రక్షణే ప్రభుత్వ ధ్యేయం

## ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.



జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ లో మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ తో కలిసి మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడు ధాన్యాల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల రైతులు మక్కలు, పొద్దు తిరుగుడు ధాన్యాలను దళాలకు విక్రయించకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. దళారి వ్యవస్థనుండి రైతులను రక్షించడానికి ప్రభుత్వం తరపున కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, ఏఎంసి డైరెక్టర్లు, ఏఎంసీ మాజీ చైర్మన్ అక్కర వేణి పోచయ్య, మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాలకు కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



### ఎమ్మెల్యే చేతుల మీదుగా పోటీ పరీక్షల పుస్తకావిష్కరణ

జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో గల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, గుగ్గిళ్ళ వాస్తవ్యులు నా రోజు శంకరాచారి, యువతను ప్రభుత్వ పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడానికి సంకల్పించి అత్యున్నత లక్ష్యంతో రచించిన" నా గమ్యం ఐఏఎస్" అనే పుస్తకాన్ని శనివారం మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతకు స్ఫూర్తినిచ్చే పుస్తకాలు రచిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు శంకరాచారికి అభినందనలు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బైరా సంతోష్, కాంగ్రెస్ యువ నాయకులు బోయిని ప్రశాంత్, పిట్టల అరుణ్, ప్రభుత్వ ఉపాధ్యాయులు రామంచ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లోకి పర్లపల్లి సర్పంచ్

### బంక్వేట్ హాల్‌ని ప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్ జనతా న్యూస్ : మండలంలోని పర్లపల్లి గ్రామ సర్పంచ్ సూరం స్వప్న కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం పర్లపల్లి లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ రాగా ఆయన సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకుని చేరారు. సర్పంచ్ తో పాటు పలువురు వార్డు సభ్యులు కాంగ్రెస్లో చేరారు. అనంతరం గ్రామైక్య సంఘ భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి రమేష్, మోరపల్లి రమణారెడ్డి, ఎస్ ఎల్ గౌడ్, గోగురి నరసింహారెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, సూరం మహేందర్ రెడ్డి, గొట్టేముక్కుల సంపత్ రెడ్డి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### బంక్వేట్ హాల్ ని ప్రారంభం...



తిమ్మాపూర్ మండలం ఇందిరానగర్ లో నూతనంగా ఏర్పాటుచేసిన పిసిఆర్ బంక్వేట్ హాల్ ని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. ఇందిరానగర్ చౌరస్తా వద్ద రాజీవ్ రహదారి పక్కనే ఏర్పాటు చేసిన బంకెట్ హాల్ అందరికీ ఉపయోగపడుతుందని, పేద వర్గాల వారికి అందుబాటులో ఉండేలా చూడాలని పారుపల్లి చంద్రారెడ్డికి ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అవుదుర్తి రామకృష్ణ, గుజ్జుల శ్వేత, గాండ్ల శ్రీనివాస్, నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, పొన్నం అనిల్ గౌడ్, మామిడి అనిల్, చంద్రయ్య, నర్సింగరావు, మొండయ్య, జనార్దన్ రెడ్డి, రాజిరెడ్డి, మేడి అంజయ్య, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో మిన్నంటిన రంజాన్ సంబరాలు

### జర్నలిస్ట్ అక్రమ్ నివాసంలో వేడుకలు..

### హాజరైన ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు



హుస్నాబాద్,జనత న్యూస్:హుస్నాబాద్ పట్టణంలో రంజాన్ పండుగ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ముస్లిం సోదరులు నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు ముగించుకుని, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రముఖ జర్నలిస్ట్ ఎండి. అక్రమ్ తన నివాసంలో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.అక్రమ్ ఆహ్వానం మేరకు ఆయన నివాసానికి చేరుకున్న అంతక పేట సర్పంచ్ కోహెడ సృజన్ గౌడ్,సిపిఐ ,కాంగ్రెస్ నాయకులు, జర్నలిస్టులు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రంజాన్ పండుగ మానవతా విలువలకు, క్రమశిక్షణకు ప్రతీక అని, కులమతాలకు అతీతంగా జరుపుకునే ఇఫ్తార్ విందులు గంగా జమునా తెహజీబ్‌కు నిదర్శనమని కొనియాడారు.వేడుకల్లో న్యూ ప్రెస్ క్లబ్ కు చెందిన పాత్రికేయ మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అక్రమ్ కుటుంబ సభ్యులు అతిథులకు సాదరంగా స్వాగతం పలికి, రంజాన్ ప్రత్యేక వంటకమైన 'షీర్ ఖుర్మా'ను వడ్డించారు. విభిన్న రంగాలకు చెందిన వారు ఒకే చోట చేరి ఆత్మీయంగా పలకరించుకోవడంతో అక్కడ పండుగ వాతావరణం సంతరించుకుంది.ఈ వేడుకలో కాంగ్రెస్,సిపిఐ నాయకులు బురుగు కృష్ణస్వామి,కొమ్ముల భాస్కర్, న్యూ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బానోతు హన్మంత్ నాయక్, పాత్రికేయులు కోయ్యడా అనిల్ కుమార్, కాశ బోయిన రవీందర్, మాటూరు గోపి, పచ్చిమట్ల శివ, ఠాకూర్ నర్సింగ్, ఆకుల రాజు,చిట్టంపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్ పై మండల సిపిఐ, సిపిఎం పార్టీలు అసంతృప్తి





జనత న్యూస్ బెజ్జంకి : ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026 సంవత్సరం ఆర్థిక బడ్జెట్ కేటాయింపులపై మండల సిపిఐ, సిపిఎం పార్టీలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ మాట్లాడుతూ, విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపులో అన్యాయం జరిగిందని, కాంట్రాక్టు ఉద్యోగులు, సింగరేణి కార్మికుల గురించి ఎలాంటి నూతన ప్రతిపాదనలు పెట్టలేదని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు గతంలో 14 వేల కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్ లో 7 వేల కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ మాట్లాడుతూ ఈసారి బడ్జెట్లో రైతులను, కార్మికులను, నిరుద్యోగులను ప్రభుత్వం తీవ్ర నిరాశకు గురిచేసిందని విమర్శించారు.

## బెజ్జంకి మండలవ్యాప్తంగా ఘనంగా రంజాన్ వేడుకలు

### ముస్లిం లకు శుభాకాంక్షలు తెలిపిన ఎల శేఖర్ బాబు.



జనత న్యూస్ బెజ్జంకి :నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు, ఖురాన్ పఠనం, భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు జరుపుకున్న మానకొండూర్ నియోజకవర్గ ముస్లిం సోదర సోదరీమణులకు మానకొండూరు నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జి ఎల శేఖర్ బాబు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.అందరూ ఆరోగ్యంగా ఉండి, తమ వృత్తుల్లో రాణించాలని కోరుతున్నామని తెలిపారు.మండలంలోని ముస్లింలు వారి ప్రార్థన ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారికి ఎల శేఖర్ బాబు శుభాకాంక్షలు తెలిపారు.

## వాగేశ్వరిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తిమ్మాపూర్, జనతా న్యూస్ : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. కళాశాల చెందిన 2006-2010 మొదటి బ్యాచ్ ఈఈఈ విద్యార్థులు కళాశాలలో కలుసుకొని తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కళాశాలల జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల నుండి ఉత్తీర్ణత సాధించి మంచి స్థాయిలో ఉండడం తమకు గర్వకారణమని అన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్యను అందించడానికి తాము కృషి చేస్తున్నామని తెలిపారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాల నుండి వచ్చి విద్యను వాగేశ్వరి కళాశాలలో టెక్నికల్ విద్యను అభ్యసించినట్లు తెలిపారు. తమ భవిష్యత్తుకు పునాది లాంటి టెక్నికల్ విద్యను అందించిన కళాశాలను యాజమాన్యం లెక్చరర్లను మర్చిపోలేమని అన్నారు. జాయింట్ సెక్రెటరీ ఐ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాష్ రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాస్, హెచ్ ఓ డి చంద్రమౌళి, లెక్చరర్లు పాల్గొన్నారు.

## ఎస్సై చంద్రశేఖర్‌కు నివాళులు.. కుటుంబానికి సానుభూతి

కరీంనగర్, మార్చి 20: కరీంనగర్ టౌన్ ఎస్సై చంద్రశేఖర్ అకాల మరణంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జమ్మికుంటలో చంద్రశేఖర్ పార్థివ దేహానికి వారు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించిన ఉత్తమ పోలీస్ అధికారిగా చంద్రశేఖర్ నిలిచారని కొనియాడారు. ఆయన మరణం పోలీస్ శాఖకు తీరని లోటని పేర్కొన్నారు. నిబద్ధతతో పనిచేసిన అధికారి కోల్పోవడం బాధాకరమని తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# కొండగట్టు అంజన్నను దర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్, మార్చి 20: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం కొండగట్టుకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, పలువురు కార్పొరేటర్లు కూడా పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు చేసిన బండి సంజయ్, శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆయనకు శాలువా కప్పి ఆశీర్వచనం అందించారు.



## చౌక ధరలో నాణ్యమైన మందులు.. జన ఔషధి కేంద్రాల వినియోగం పెంచాలి: బండి సంజయ్




కరీంనగర్, మార్చి 20: సామాన్య ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన మందులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు. శుక్రవారం కరీంనగర్ ముకరంపుర డాక్టర్ స్ట్రీట్‌లో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రైవేట్ మెడికల్ షాపుల్లో మందుల ధరలు అధికంగా ఉండడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పేదలకు వైద్యం భారంగా మారకుండా ఉండేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలతో పాటు జన ఔషధి కేంద్రాలను ప్రారంభించారని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా తక్కువ ధరలో నాణ్యమైన జనరిక్ మందులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. బ్రాండెడ్ మందులపై ఖర్చు తగ్గించడం, గ్రామీణ ప్రాంతాల్లో కూడా మందులు అందుబాటులో ఉంచడం, ఆరోగ్య సేవలను అందరికీ చేరువ చేయడం ఈ పథకం లక్ష్యమని తెలిపారు. కరీంనగర్ ప్రజలు జన ఔషధి కేంద్రాల్లో లభించే మందులను వినియోగించుకుని ఆర్థికంగా లాభపడాలని ఆయన సూచించారు.

## ఎల్బీ స్టేడియంలో 30 వేల మందితో వాసవీ పారాయణం.. ప్రపంచ రికార్డు దిశగా మహోత్సవం

హైదరాబాద్, మార్చి 20: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం ఈ నెల 22న జరగనున్న శ్రీ వాసవీ మహాశక్తి మహోత్సవానికి వేదికగా నిలవనుంది. ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మహోత్సవంలో దాదాపు 30 వేల మంది ఆర్యవైశ్యులు ప్రముఖ కవి చింతల శ్రీనివాస్ రచించిన 102 చరణాల వాసవీ పారాయణాన్ని సామూహికంగా ఆలపించనున్నారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇంత పెద్ద సంఖ్యలో పారాయణం జరగడం ప్రపంచ రికార్డు సృష్టించనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఘట్టాన్ని నమోదు చేయడానికి గిన్నీస్ ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత గుప్త మాట్లాడుతూ, ఆర్యవైశ్యులను ఒకే వేదికపైకి తీసుకురావడం, ఆధ్యాత్మికతతో పాటు సేవా భావాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరుకానున్నారు. పలువురు మంత్రులు,



ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జాతీయ స్థాయి నాయకులు కూడా పాల్గొననున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి ఆర్యవైశ్య సంఘాలు, సేవా సంస్థలు ఈ మహోత్సవంలో భాగస్వామ్యం అవుతున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి ఉచిత ప్రవేశం కల్పించినప్పటికీ ముందస్తుగా నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. వాసవీ పారాయణంతో పాటు భజన కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు కూడా నిర్వహించనున్నారు.

## విద్యారంగంపై నిర్లక్ష్యం.. బడ్జెట్ పత్రాలు దహనం చేసిన ఏఐఎస్ఎఫ్



కరీంనగర్, మార్చి 20: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన నిధులు కేటాయించలేదని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గీతా భవన్ చౌరస్తా వద్ద బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ, విద్యారంగంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. బడ్జెట్‌లో విద్యకు కేవలం 8.22 శాతం మాత్రమే కేటాయించడం విద్యార్థి వ్యతిరేక విధానమని అన్నారు. ఎన్నికల సమయంలో 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, తగిన నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. ఉన్నత విశ్వవిద్యాలయాలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలకు సరిపడ నిధులు ఇవ్వకపోవడం వల్ల విద్యా వ్యవస్థ దెబ్బతింటుందని తెలిపారు. విద్యారంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయించి పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నునావత్ శ్రీనివాస్ నాయక్, నగర ఉపాధ్యక్షుడు కసిరెడ్డి సందీప్ రెడ్డి, సహాయ కార్యదర్శి బోయిని విష్ణువర్ధన్, నాయకులు సంపత్, సాయి కృష్ణ, అశోక్, అభి తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణకు బీఎస్పీ పోరాటం కొనసాగుతుంది: నిషాని రామచంద్రం



కరీంనగర్, మార్చి 20: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రాజ్యాంగాన్ని బలహీనపర్చే విధంగా వ్యవహరిస్తున్నాయని బీఎస్పీ జోన్-1 ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం ఆరోపించారు. శుక్రవారం కరీంనగర్‌లో నిర్వహించిన జోన్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి జోన్ ఇంచార్జ్ మాతంగి అశోక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిషాని రామచంద్రం మాట్లాడుతూ, దేశంలో రాజ్యాంగ పరిరక్షణ అత్యంత ముఖ్యమని, బహుజనుల హక్కులు కాపాడాలంటే రాజ్యాంగాన్ని రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాజ్యాంగాన్ని బలహీనపరచే చర్యలు తీసుకుంటోందని, కాంగ్రెస్ పార్టీ కూడా ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని విమర్శించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం దేశానికి పునాది అని, అది దెబ్బతింటే బహుజనులకు నష్టం జరుగుతుందని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం బీఎస్పీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి నాయకత్వంలో బహుజన ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎనగందుల వెంకన్న, దొడ్డే సమ్మయ్య, కళ్లేపల్లి రాజేందర్, నీరడి ఈశ్వర్, గంగాధర్, దొడ్డే శ్రీనివాస్, హరినాథ్, కోమిరే పోచెట్టి, సింగడే పాండు, హరి లాల్ నాయక్, మాతంగి మల్లయ్య, అనిల్, మంద బాలయ్య, అంబాల శతీష్, బోయిని బాబు, వేల్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాలో రెండు అగ్నిప్రమాదాలు

### భారీగా ఆస్తినష్టం ..సకాంలో స్పందించిన అధికారులు

**ఖమ్మం,మార్చి21 :** ఖమ్మం జిల్లాలో రెండు వేర్వేరు అగ్నిప్రమాద ఘటనలు జరిగాయి. ఓలా ఎలక్ట్రిక్ బైక్ షోరూంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఖమ్మం నగరంలోని రోటరీ నగర్ ప్రాంతంలో ఉన్న ఓలా ఎలక్ట్రిక్ బైక్ షోరూంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మరో ఘటనలో మధిర మండలం ఆత్కూర్ వద్ద శ్రీ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీలో అగ్నిప్రమాదం జరిగింది. ఖమ్మం నగరంలోని రోటరీనగర్ ప్రాంతంలో ఉన్న ఓలా ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. షోరూమ్‌లో ఉన్న పలు ఎలక్ట్రిక్ బైకులు మంటలకు ఆహుతయ్యాయి. బైకుల బ్యాటరీల కారణంగా మంటలు వేగంగా వ్యాపించడంతో దట్టమైన పొగ అలుముకుంది. ఈ ఘటనపై పోలీసులకు, అగ్నిమాపక అధికారులకు స్థానికులు సమాచారం అందజేశారు. ఫైర్ సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. చార్జింగ్ పెట్టిన సమయంలో లేదా షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని మధిర మండలం, ఆత్కూర్ సమీప ప్రాంతంలో గల శ్రీ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచిన మిర్చి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు మంటల్లో చిక్కుకున్నాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. స్థానికుల సమాచారంతో ÷ర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. కోల్డ్ స్టోరేజీలో ఉండే ఇన్సులేషన్ మెటీరియల్ కారణంగా మంటలను ఆర్పడం సిబ్బందికి సవాలుగా మారింది. ఖమ్మం జిల్లాలో జరిగిన ఈ రెండు అగ్నిప్రమాదాలు భారీ ఆస్తి నష్టాన్ని మిగిల్చినట్లు తెలుస్తోంది. విద్యుత్ ఉపకరణాల వినియోగంలో అజాగ్రత్త వహించవద్దని అధికారులు సూచించారు. ఈ రెండు ఘటనల్లో ప్రాణనష్టం సంభవించకపోయినా, భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. ఈ రెండు ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com